మన తెనాలి 76599 35993

- ప్రజా సమస్యల పరిష్కారానికి వాట్సప్ నంబరు
- 24 గంటలూ అందుబాటులో

మంత్రి మనోహర్



తెనాలి టౌన్, న్యూస్‌టుడే

ప్రజల సమస్యల పరిష్కారమే సుపరిపాలన మార్గమని, ఇందుకోసం 'మన తెనాలి వాట్సప్ నంబరు: *76599 35993*' ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖల మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. తెనాలిలో మంగళవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, సబ్ కలెక్టర్ సంజనా సింహ, ఇతర అధికారులతో కలిసి మంత్రి వాట్సప్ నంబరు ప్రకటించారు. రాష్ట్రంలోనే నమూనాగా ప్రభుత్వాన్ని మీ ఇంటికి చేర్చే కార్యక్రమంగా తెనాలిలో మొదలవుతున్న ఈ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలు తమ సమస్యలను క్లుప్తంగా తక్కువ అక్షరాలతో తెలియచేయాలని, ఒక్క ఫొటో మాత్రమే అప్‌లోడ్ చేయాలని, సంబంధిత వ్యక్తులను అధికారులు సంప్రదించి సమగ్ర సమాచారం తీసుకుంటారన్నారు. వ్యక్తులను, వ్యవస్థలను కించపరిచేలా, ప్రజల నడుమ చిచ్చు పెట్టేలా, అనవసర విమర్శలు చేస్తూ, పెట్టకూడని పోస్టింగ్‌లు పంపరాదని, బృందంలో పోలీస్ అధికారులూ ఉంటారని వివరించారు.

ప్రజలకు దైనందిన జీవితంలో ఎదురయ్యే మురుగు కాలువలు, వీధి దీపాలు వంటి సమస్యలే కాకుండా ఆరోగ్య సేవలు, వ్యవసాయ ఇబ్బందులు, గంజాయి అరికట్టడం, మహిళలపై వేధింపుల నివారణ తదితర సమగ్ర సేవలు అందించే ప్రణాళిక తయారు చేసుకున్నాం. ఇది ప్రభుత్వ అధికారిక కార్యక్రమంగా స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొటోకాల్ (ఎస్‌వోపీ) విధానంలో కొనసాగుతుంది. దాదాపు 12 విభాగాల అధికారులు భాగస్వాములుగా ఉంటారు. రోజులో 24 గంటలు, ఏడాదిలో 365 రోజులూ మేమంతా కృషి చేస్తాం. **- మనోహర్**

గంజాయి బ్యాచ్ వీరంగం



పోలీసు అవుట్ పోస్టులో కానిస్టేబుల్‌పై తిరగబడుతున్న గంజాయి బ్యాచ్

ఈనాడు, అమరావతి: గంజాయి బ్యాచ్ పోలీసుల్నే తారెత్తించింది. దాడికి దిగి నానా బీభత్సం సృష్టించింది. సోమవారం రాత్రి 7 గంటల సమయంలో చుట్టుగుంట పోలీస్ అవుట్‌పోస్టుకు సమీపంలో ఐదారుగురు యువకులు గంజాయి సేవించి ప్రధాన రహదారిపై. బైకులను అడ్డంగా పెట్టి వాహనదారులను దుర్భాషలాడుతూ నానా యాగీ చేశారు. ఓ ద్విచక్రవాహనదారుడు సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తుండగా చూసి లాగేసి నేలకేసి కొట్టారు. తర్వాత మరో వాహనదారుడికి వారు బైకు అడ్డుపెట్టి అతనితో గొడవకు దిగారు. ఇదేంటని మరికొంతమంది నిలదీయగా గంజాయి బ్యాచ్ ఒక్కసారిగా రెచ్చిపోయింది. వారిపై దాడికి దిగడంతో తలోదిక్కుకు పరుగులు తీశారు. సమీపంలోని హోంగార్డు, మరో కానిస్టేబుల్ అక్కడికొచ్చి అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించగా వీరిపైనా దాడికి తెగబడ్డారు. ముఠాను పోలీస్ అవుట్‌పోస్టుకు తరలిస్తుండగా అందులో ఒకరు కానిస్టేబుల్ చొక్కా పట్టుకుని దౌర్జన్యానికి దిగాడు. ఈలోగా గంజాయి బ్యాచ్‌కు చెందిన ఓ మహిళ వచ్చి వారినెందుకు పట్టుకున్నారని పోలీసులను ప్రశ్నించి, బలవంతంగా బయటకు తీసుకొచ్చింది. వీరిలో కొందరు పోలీసుల కళ్లుగప్పి పరారయ్యారు.

పేదలను వెళ్లగొట్టి..

- అనర్హుల చేతికి టిడ్కో ఇళ్లు
- నాటి వైకాపా హయాంలో మాయాజాలం

న్యూస్‌టుడే - పొన్నూరు

నిరుపేదలకు దక్కాల్సిన టిడ్కో గృహాలు పరుల చేతుల్లో చిక్కుకుపోయాయి. గత వైకాపా హయాంలో ఆ పార్టీ నేతలజోక్యంతో ఇళ్లను అమ్మేశారు. ఇలా 400 వరకు ఇళ్లు అనర్హుల చేతుల్లో ఉన్నాయి.



నిడుబ్రోలులో టిడ్కో గృహాలకు

కేటాయించిన స్థలం	21.70 ఎకరాలు
నిర్మించిన ఇళ్లు:	2,368
కేటాయించిన నిధులు:	రూ. 177.34 కోట్లు
లబ్ధిదారులకిచ్చినవి:	1,600
ఇంకా పంపిణీ చేయాల్సినవి:	768
ఇతరులకు విక్రయించినవి:	సుమారు 400

2014-19 మధ్యకాలంలో అప్పటి తెదేపా ప్రభుత్వం నిడుబ్రోలులో టిడ్కో గృహ నిర్మాణ పనులు మొదలుపెట్టింది. అప్పట్లోనే దాదాపుగా 80 శాతం నిర్మాణం పూర్తయింది. పురపాలకసంఘ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి పట్టాలిచ్చారు. 2019లో వైకాపా అధికారంలోకొచ్చాక ఒక్క పైసా కూడా కేటాయించలేదు. లబ్ధిదారులకు కనీసం మౌలిక వసతులను కూడా కల్పించలేదు. లక్షలాది రూపాయలు వెచ్చించి ఆ ఇళ్లకు వైకాపా రంగులు మాత్రం వేయించింది.


వైకాపా ప్రభుత్వ హయాంలో అక్రమాలకు బీజం పడింది. వివిధ కారణాలు చూపించి దాదాపుగా 250 మందిని లబ్ధిదారుల జాబితా నుంచి తొలగించారు. వీరి స్థానంలో కొత్తవారిని చేర్చారు. ఇందుకోసం అప్పట్లో పురపాలకసంఘంలోని కీలక అధికారిణి ఒక్కో లబ్ధిదారుడి నుంచి సుమారు రూ. 30 వేల నుంచి రూ. 50 వేల వరకు వసూలు చేసినట్టు ఆరోపణలొచ్చాయి. ఈ మొత్తంలో కొంత వాటా అప్పట్లో వైకాపాలోని కీలక నేతకు ఇచ్చినట్టు బయటకొచ్చింది. అంతేకాదు.. దాదాపుగా 400 మంది తమ ఇళ్లను రూ. 2.50 లక్షల నుంచి రూ. 3.50 లక్షల వరకు బహిరంగంగా అమ్మేశారు. ఇందులో కొంతమంది బినామీ పేర్లతో వైకాపా నేతలే కొనుగోలు చేశారు. ఈ అక్రమాలపై విచారణ చేస్తే అనేక వాస్తవాలు వెలుగులోకొస్తాయి.

అర్హత ఉన్నా తొలగించారు



తెదేపా ప్రభుత్వ హయాంలో అధికారులు టిడ్కో ఇల్లు కేటాయించారు. రూ. 50 వేలు చెల్లించా. వైకాపా ప్రభుత్వం వచ్చాక జాబితా నుంచి మా పేరు తీసేశారు. ఇలా ఎందుకు చేశారని అధికారులను ఎన్నోసార్లు కలిసి ఫిర్యాదు చేశా. వారెవరూ స్పందించలేదు. ఇప్పటికైనా మా ఇల్లు ఇప్పించాలని కోరుకుంటున్నా. **- కొణిదల అప్పమ్మ, 14వ వార్డు**

అధికారులు పట్టించుకోలేదు



నిడుబ్రోలు రైలుపేట చెరువు కట్టపై చిన్న గుడిసెలో ఉంటున్నాం. 2018లో అధికారులు టిడ్కోలో గృహం కేటాయించారు. వైకాపా అధికారంలోకొచ్చాక సచివాలయ సిబ్బంది వచ్చి ఇంటిని రద్దు చేశారని చెప్పారు. పురపాలక సంఘ అధికారులు సమాధానం చెప్పలేదు. **- బొలగాని వెంకాయమ్మ**

విచారణకు ఆదేశించాం




తెదేపా అధికారంలో ఉన్నప్పుడు అధికారులు అర్హులైనవారినే ఎంపిక చేశారు. రాజకీయాలకతీతంగా జాబితా రూపొందించారు. 2019లో వైకాపా అధికారంలోకొచ్చాక అక్రమాలు చోటుచేసుకున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన క్రయవిక్రయాలుపై విచారణ చేయాలని అధికారులను ఆదేశించాం. అది పూర్తయిన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటా. **- ధూళిపాళ్ల నరేంద్రకుమార్**

విధేయతకే పట్టం

- కూటమి శ్రేణులను వరించిన నామినేటెడ్ పదవులు
- క్రియాశీలక సేవలకు గుర్తింపు

ఈనాడు - అమరావతి, న్యూస్‌టుడే బృందం

నిత్యం ప్రజలతో మమేకమవడం.. పార్టీలో క్రియాశీలకంగా పని చేయడమే కొలమానంగా తెదేపా కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పోస్టులను భర్తీ చేసింది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నాయకులు, కార్యకర్తల్లో ఆనందం నింపింది. వైకాపా ఐదేళ్ల ప్రజా వ్యతిరేక విధానాలకు ఎదురొడ్డి పోరాడిన వారికి, ప్రజలకు అండగా నిలబడినవారికే పదవుల్లో ప్రాధాన్యం దక్కింది. వీటితో పాటు వివిధ సమీకరణలనూ దృష్టిలో పెట్టుకుంది. అన్ని సామాజికవర్గాలకు సమ ప్రాధాన్యం ఇచ్చింది.



★★ రాష్ట్ర పద్మశాలి సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన **నందం అబద్ధయ్య** తెదేపాలో సీనియర్ నేత. 1982 నుంచి తెదేపాలో కొనసాగుతున్నారు. ఈయనది మంగళగిరి. జిల్లా స్థాయిలో పార్టీలో వివిధ హోదాల్లో పని చేశారు. మంగళగిరి తెదేపా పట్టణ అధ్యక్షుడిగా 15 సంవత్సరాలు సేవలందించారు. రెండుసార్లు కౌన్సిలర్‌గా గెలుపొందారు. మంగళగిరి నియోజకవర్గానికి నారా లోకేశ్ వచ్చిన తరువాత అబద్ధయ్య పనితీరు గుర్తించి 2021లో నియోజకవర్గ పార్టీ సమన్వయకర్తగా నియమించారు. గత సార్వత్రిక ఎన్నికల్లో ఇక్కడ లోకేశ్ భారీ విజయానికి ఆయన కృషి చేశారు.



★★ లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన **పిల్లి మాణిక్యరావు** తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధిగా క్రియాశీలకంగా పని చేస్తున్నారు. ఈయనది బాపట్ల జిల్లా చీరాల. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక సభ్యుడు. అందులో వివిధ హోదాల్లో పని చేసి 2017లో బయటకొచ్చి తెదేపాలో చేరారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా, రాష్ట్ర అధికార ప్రతినిధిగా బాధ్యతలు నిర్వర్తించారు. వినుకొండ నియోజకవర్గ పరిశీలకుడిగా పని చేశారు. గత ఎన్నికల్లో ప్రత్తిపాడు సీటు ఆశించారు. గుంటూరు లోక్‌సభ పరిధిలోని పలు నియోజకవర్గాల్లో పార్టీ విజయానికి ప్రచారం నిర్వహించారు.

★★ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ సభ్యురాలిగా అమరావతి మహిళా ఐకాస నాయకురాలు డాక్టర్ రాయపాటి శైలజకు అవకాశం దక్కింది.

అమరావతి నిర్మాణంతోనే రాష్ట్రానికి భవిష్యత్తు

- రుణాలిచ్చి సహకరించండి
- బ్యాంకుల ప్రతినిధులతో అమరావతి ఐకాస నాయకులు, మహిళలు

తుళ్లూరు, న్యూస్‌టుడే

అమరావతి నిర్మాణానికి నిధులు ఇచ్చి ఆదుకోవాలని రాజధాని రైతులు, అమరావతి ఐకాస నాయకులు ప్రపంచ బ్యాంకు, ఏసియన్ అభివృద్ధి బ్యాంకు ప్రతినిధులను కోరారు. మంగళవారం తుళ్లూరు సీఆర్డీఏ కార్యాలయంలో ఆయా బ్యాంకుల ప్రతినిధులు రాజధాని రైతులు, రైతు కూలీలు, ఐకాస నాయకులు, డ్వాక్రా మహిళలతో సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. ఐకాస నాయకులు, రాజధాని రైతులు మాట్లాడుతూ ఏ రాష్ట్రమైనా అభివృద్ధి చెందాలంటే సుస్థిరమైన రాజధాని కావాలని, ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు రైతుల నుంచి 34 వేల ఎకరాలు సమీకరించి అధునాతన ఆలోచనలతో అమరావతి నిర్మాణానికి శ్రీకారం చుట్టారని వివరించారు. దీనివల్ల ఇక్కడి భూముల ధరలు పెరగడంతోపాటు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు వచ్చాయన్నారు. 2019లో వైకాపా ప్రభుత్వం ఏర్పడిన తరువాత అప్పటి సీఎం జగన్ మూడు రాజధానులంటూ అమరావతిని నిర్వీర్యం చేయడంతో తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. న్యాయం కోరుతూ రోడ్డెక్కి నిరసన తెలిపితే ఉద్యమకారులపై అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురి చేశారన్నారు. అప్పటి పరిస్థితిని వీడియోల రూపంలో బ్యాంకుల ప్రతినిధులకు వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో రాష్ట్రం తిరిగి ప్రగతి పథంలో నిలవడం ఖాయమని, అమరావతి నిర్మాణానికి రుణాలు ఇవ్వాలని చేతులు జోడించి అభ్యర్థించారు. అనంతరం తుళ్లూరు మండలంలోని డ్వాక్రా మహిళలతో బ్యాంకుల ప్రతినిధులు చర్చించారు. అమరావతి ఐకాస నాయకులు ధనేకుల రామారావు, మాదల శ్రీనివాస్, అనుమోలు గణేష్, జూజాల చలపతిరావు, బెల్లంకొండ నరసింహారావు, కాటా అప్పారావు, చిలకా బసవయ్య, వరలక్ష్మి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



రాజధాని రైతులు, ఐకాస నాయకులతో చర్చిస్తున్న ప్రపంచ, ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకుల ప్రతినిధులు

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం..

రాజధాని రైతులు, రైతు కూలీల సమస్యలను తెలుసుకొని వెంటనే పరిష్కరించటానికి ప్రత్యేక కాంపిటెంట్ అథారిటీలను ఏర్పాటు చేస్తున్నామని సీఆర్డీఏ అదనపు కమిషనర్ జి. సూర్యసాయి ప్రవీణ్ చంద్ వెల్లడించారు. త్వరలోనే అసైన్డ్ రైతులకు కౌలు చెల్లిస్తామని, రైతుల ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేశామన్నారు. ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు (పర్యావరణ, సామాజిక నిపుణులు) బి. వెంకటరావు, ఎన్. వెంకటసుబ్బారావు, రంజన్ వర్మ, ఈఎన్ఏ సోబ్క్ జెనెస్కా, ఏసియన్ అభివృద్ధి బ్యాంక్ ప్రతినిధులు హర్షవర్ధన్ సింగ్, జానీ మాథ్యూ, సరస్వతి ఘోష్, క్యోకో యునెత్సా, తులసి చరణ్, అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

సీఆర్డీఏలో ఉద్యోగ ప్రకటనలు

✤ డిప్యుటేషన్, ఒప్పంద ప్రాతిపదికన భర్తీకి చర్యలు

ఈనాడు - అమరావతి: సీఆర్డీఏలో కీలకమైన పోస్టుల భర్తీకి చర్యలు ప్రారంభమయ్యాయి. వైకాపా హయాంలో కార్యకలాపాలు నిలిచిపోయి నిస్తేజంగా మారిన రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ ఇప్పుడు క్రియాశీలకంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో డిప్యుటేషన్‌పై వచ్చిన వారినీ కక్షగట్టి సాగనంపారు. రాజధానిలో త్వరలో పనులు తిరిగి ప్రారంభం కానున్న నేపథ్యంలో సీఆర్డీఏలోని అన్ని విభాగాలను పటిష్ఠం చేస్తున్నారు. ఇందులో భాగంగా సీఆర్డీఏలోకి ప్రతిభావంతులైన అధికారులు, సిబ్బందిని డిప్యుటేషన్, కాంట్రాక్ట్ ప్రాతిపదికన పలు పోస్టులను భర్తీ చేస్తున్నారు. ఇందుకు రెండు ఉద్యోగ ప్రకటనలను కమిషనర్ కాటమనేని భాస్కర్ జారీ చేశారు.

మళ్లీ పూర్వ కళ...

గత తెదేపా హయాంలో సీఆర్డీఏలో ఐదు శాఖల్లో 778 పోస్టులను మంజూరు చేసింది. అప్పట్లో 494 మంది అధికారులు, సిబ్బంది పనిచేశారు. వీరిలో సీఆర్డీఏ రెగ్యులర్ ఉద్యోగులు 83 మంది, పూర్వ వీజీటీఎం ఉడా సిబ్బంది.. 43, సీఆర్డీఏ ఒప్పంద సిబ్బంది 112, పొరుగుసేవల సిబ్బంది 140 మంది, ఇతర శాఖల నుంచి డిప్యుటేషన్లపై 116 మంది చొప్పున విధులు నిర్వర్తించారు. 2019లో వైకాపా వచ్చిన తర్వాత పనులను ఆపేసి, ఉన్న వారిని పంపారు. చాలా మంది తమ మాతృ శాఖలకు వెళ్లిపోయారు. గతంలో మంజూరైన అన్ని పోస్టులను భర్తీ చేస్తామని ఇటీవల పురపాలక శాఖ మంత్రి నారాయణ పలు సార్లు చెప్పారు. ఈ నేపథ్యంలో ఖాళీ పోస్టులను నింపేందుకు కసరత్తు చేస్తున్నారు.

పోస్టుల కేటాయింపు ఇలా..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందిని డిప్యుటేషన్‌పై సీఆర్డీఏకు వచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్న వారి కోసం జారీ చేశారు. ఎస్‌ఈ, ఈఈ, డీఈఈ, ఏఈఈ హోదాల్లో మూడేళ్ల కాలానికి పనిచేసేందుకు సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఇండస్ట్రియల్, ట్రాఫిక్ అండ్ ట్రాన్స్‌పోర్టేషన్, స్ట్రక్చరల్, తదితర విభాగాల్లో ఇంజినీరింగ్ చేసిన వారు అర్హులుగా పేర్కొన్నారు. పోస్టులను బట్టి రెండు నుంచి 12 ఏళ్ల అనుభవం ఉన్న వారు కావాలని ఉద్యోగ ప్రకటనలో కోరారు. వచ్చే నెల 4 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఇచ్చారు. 108 పోస్టులను డిప్యుటేషన్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నారు. ఏడాది కాలానికి ఒప్పంద పద్ధతిన పని చేసేందుకు 12 పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానించారు. లీగల్ మేనేజర్, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్, ఎన్విరాన్‌మెంటలిస్ట్, ఎన్విరాన్‌మెంటల్ స్పెషలిస్ట్, పబ్లిక్ రిలేషన్స్ మేనేజర్, కంటెంట్ రైటర్, గ్రాఫిక్ డిజైనర్, వీడియో ఎడిటర్, ఎంఐఎస్ ఆపరేటర్, కమ్యూనికేషన్స్ జేడీ పోస్టుల కోసం పిలిచారు. బ్యాంకుల కన్సార్షియం, ప్రపంచ బ్యాంకు, ఏడీబీ, తదితర బ్యాంకులతో సమన్వయం కోసం, సామాజిక మాధ్యమాల్లో రాజధాని, సీఆర్డీఏ కార్యకలాపాలను జనబాహుళ్యంలోకి తీసుకెళ్లేందుకు ప్రధానంగా కాంట్రాక్టు పోస్టులను నిర్దేశించారు.

పథకాలకు రుణాలు మంజూరు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

కలెక్టరేట్(గుంటూరు): వార్షిక రుణ ప్రణాళికలో నిర్దేశించిన లక్ష్యాల మేరకు ప్రభుత్వ ప్రాధాన్య పథకాలకు సక్రమంగా రుణాలను మంజూరు చేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి.. బ్యాంకర్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ శంకరన్ హాలులో మంగళవారం జిల్లా స్థాయి కన్సల్టేటివ్ కమిటీ, సమీక్ష కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల వరద ముంపును ఎస్ఎల్‌బీసీ ప్రకృతి వైపరీత్యంగా ప్రకటించినందున ఆర్బీఐ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం వ్యవసాయ, వ్యక్తిగత, వాణిజ్య రుణాలను బ్యాంకర్లు రీ షెడ్యూల్, రీస్ట్రక్చరింగ్ చేయాలన్నారు. బ్యాంకర్లు ప్రభుత్వం వరద ముంపు పరిహారం మంజూరు చేసిన కుటుంబాల వివరాలను ప్రామాణికంగా తీసుకోవాలన్నారు. కౌలు రైతులకు బ్యాంకర్ల వారీగా నిర్దేశించిన లక్ష్యాల మేరకు పంట రుణాలను కచ్చితంగా మంజూరు చేయాలన్నారు. స్వయం సహాయక సంఘాలకు వ్యాపారాలు ఏర్పాటుకు, గృహ నిర్మాణాలకు, ఉన్నత విద్యకు అత్యధిక ప్రాధాన్యంతో బ్యాంకర్లు రుణాలివ్వాలన్నారు. డీసీసీ కన్వీనర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ హెడ్ డీజీఎం ఎస్.జవహర్, ఎల్‌డీఎం మహిపాల్‌రెడ్డి, ఆర్బీఐ మేనేజర్ నాగప్రవీణ్, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, మత్స్యశాఖ ఏడీ గాలిదేముడు, ఎస్ఎస్‌సీసీఐ రీజనల్ హెడ్ పరిమళ, బ్యాంకుల సీనియర్ ఎగ్జిక్యూటివ్స్ పాల్గొన్నారు.

ఆ లేఖ పంపించాం

తేల్చి చెప్పిన రైల్వేశాఖ ✤ అంబటి నిర్మాణాలపై జీఎంసీతో కలిసి మరోసారి తనిఖీకి నిర్ణయం

ఈనాడు, అమరావతి: గుంటూరు నగరంలోని పట్టాభిపురంలో వైకాపా నాయకుడు అంబటి మురళీకృష్ణ నిర్మిస్తున్న గ్రీన్‌గ్రేస్ అపార్ట్‌మెంట్లకు గతంలో ఇచ్చిన నిరభ్యంతర (ఎన్‌వోసీ) పత్రాన్ని రద్దు చేసిన మాట వాస్తవమేనని రైల్వేశాఖ తాజాగా నగరపాలక సంస్థకు రాతపూర్వకంగా తేల్చి చెప్పింది. ఈ పరిణామంతో నగరపాలక వర్గాల్లో వణుకు మొదలైంది. బాధ్యతగా మెలగాల్సిన అధికారులు కీలక దస్త్రాలను మాయం చేయడంపై కమిషనర్ ఆగ్రహంతో ఉన్నారు. గతేడాది మే 25న రైల్వేశాఖ ఎన్వోసీని రద్దు చేసి, తదుపరి చర్యలు తీసుకోవాల్సిందిగా జీఎంసీకి లేఖ పంపింది. దీన్ని నగర ప్రణాళికాధికారులు మాయం చేసిన సంగతి తెలిసిందే. అసలు ఈ లేఖ రాలేదని వారు తొలుత నాటకమాడారు. దీంతో కమిషనర్ పులి శ్రీనివాసులు ఈ లేఖపై స్పష్టత ఇవ్వాలని కోరగా తాజాగా రైల్వే అధికారులు రాతపూర్వకంగా తమ వివరణ తెలియజేశారు. అంతకుముందు సోమవారం సాయంత్రం కమిషనర్ నేరుగా ప్రణాళిక విభాగంలో స్వయంగా తపాలా రిజిస్టర్, ఈ-ఆఫీస్ ఫైళ్లను పరిశీలించారు. టీపీఎస్‌లు హృదయరాజు, రిజ్వానా రైల్వే లేఖను తీసుకున్నట్టు నిర్ధరణకు వచ్చారు.

సంయుక్త పరిశీలనకు ఆహ్వానిస్తూ..

అక్రమ నిర్మాణాన్ని నగర పాలక సంస్థతో కలిసి మరోసారి జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేయటానికి రైల్వే శాఖ లేఖ రాసింది. కమిషనర్ ఆదేశాల మేరకు ప్రణాళికాధికారులు రైల్వే ఇంజినీర్లతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన చేయటానికి వెళ్లాలని నిర్ణయించారు. ఈ తనిఖీ బుధ, గురువారాల్లో చేపట్టే అవకాశం ఉంది.

క్రికెట్ స్టేడియం అభివృద్ధికి సహకరించండి

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: రాజధాని అమరావతి ప్రాంతంలో ఆంధ్రా క్రికెట్ సంఘం (ఏసీఏ) అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో అంతర్జాతీయ మ్యాచ్‌లు నిర్వహించేలా అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహకారం అందించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు వినతి పత్రం సమర్పించినట్లు ఏసీఏ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. మంగళవారం ఉండవల్లిలో లోకేశ్‌ని కలిసి ఏసీఏ స్టేడియం అభివృద్ధిపై పలు సూచనలు చేసినట్లు ఎంపీ వివరించారు. వెస్టర్న్ బైపాస్ నుంచి స్టేడియానికి వచ్చేందుకు అనుబంధ రోడ్లు, నిడమర్రు రైల్వే లైన్ దగ్గర ఆర్వోబీ నిర్మాణం, పార్కింగ్‌కు స్థలం, డ్రైనేజీ ఏర్పాటుతో పాటు ఇతర సదుపాయాలు కల్పించాలని వినతి పత్రంలో కోరినట్లు పేర్కొన్నారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు.

రైళ్ల రద్దు

గుంటూరు రైల్వే, న్యూస్‌టుడే: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో ఇంజినీరింగ్ పనులు జరుగుతున్నందున పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు మండల రైల్వే అధికారి తెలిపారు. దీనివల్ల ఈనెల 23వ తేదీ నుంచి అక్టోబరు 7వ తేదీ వరకు గుంటూరు-సికింద్రాబాద్(17201), సికింద్రాబాద్-గుంటూరు(12706), గుంటూరు-సికింద్రాబాద్(12705) రైళ్లను రద్దు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా ఈ నెల 24వ తేదీ నుంచి అక్టోబరు 8వ తేదీ వరకు సికింద్రాబాద్-గుంటూరు(17202), ఈ నెల 25వ తేదీ నుంచి అక్టోబరు 7వ తేదీ వరకు విజయవాడ-గుంటూరు-విజయవాడ(07464/07465) మధ్య నడిచే రైళ్లను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

27న ఉద్యోగ మేళాలు

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేటు రంగంలో ఉద్యోగావకాశాలను కల్పించేందుకు ఈనెల 27న గుంటూరు, తుళ్లూరులో ఉద్యోగ మేళాలు నిర్వహించనున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రణయ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు బస్టాండ్ సమీపంలోని మణిపురం పైవంతెన కింద ఉన్న నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ కార్యాలయం, తుళ్లూరులోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం ప్రాంగణంలో గల న్యాక్ కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు అభ్యర్థులు విద్యార్హత ధ్రువపత్రాల నకళ్లతో హాజరు కావాలని కోరారు. వయసు 18 నుంచి 35 ఏళ్ల లోపు యువతీ, యువకులు అర్హులన్నారు. ఇతర వివరాలకు టోల్ ఫ్రీ నంబర్ 99888 53335లో సంప్రదించాలని సూచించారు.

సేవలకు గుర్తింపు

నామినేటెడ్ పదవుల్లో పలువురికి అవకాశం

ఈనాడు - అమరావతి, న్యూస్‌టుడే బృందం

ప్రజా జీవితంలో పార్టీనే నమ్ముకుని.. క్రియాశీలకంగా వ్యవహరించినవారికి తెదేపా, జనసేన, భాజపా నామినేటెడ్ పదవుల్లో అవకాశాలిచ్చాయి. రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ, ఏపీ పద్మశాలి సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్, ఏపీ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్లలో సభ్యులుగా నియమించాయి.

రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ సభ్యులుగా...



✤ **డాక్టర్ రాయపాటి శైలజ:** అమరావతి మహిళా ఐకాస నాయకురాలిగా ఉద్యమించారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి చెందినవారు. రాజధాని రైతుల పాదయాత్రతో పాటు పలు ఆందోళనలకు నాయకత్వం వహించారు. వైకాపా ప్రభుత్వం రాజధాని రైతులపై అక్రమ కేసులు బనాయించడాన్ని ఎండగట్టారు. జీఎంసీ ఎన్నికల్లో మేయర్ అభ్యర్థిగా ఈమె పేరు తెరమీదకొచ్చింది. మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు సోదరుడు గోపాలకృష్ణ కుమార్తె ఈమె.

✤ **తోట పార్థసారథి:** మంగళగిరి మండలం కురగల్లుకు చెందిన బీసీ కార్యకర్త. మంగళగిరి మండల పార్టీ అధ్యక్షుడిగా మూడేళ్లుగా పని చేస్తున్నారు. 2021 నుంచి లోకేశ్ వెంట నడుస్తూ క్రియాశీలకంగా పని చేస్తున్నారు.



✤ **కేసన కోటేశ్వరరావు:** తెనాలి మండలం సోమసుందరపాలేనికి చెందిన బీసీ నేత. 2013 నుంచి తెదేపాలో ఉన్నారు. గతంలో పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా పని చేశారు. ప్రస్తుతం తెదేపా తెనాలి మండల అధ్యక్షుడిగా ఉన్నారు. కౌలు రైతుగా వ్యవసాయం చేస్తూనే రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉన్నారు.

ఏపీ పద్మశాలి సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ సభ్యులుగా...

✤ **కందుల నాగార్జున:** మంగళగిరికి చెందిన ఈయన తెదేపా యువత విభాగంలో చురుగ్గా పని చేస్తున్నారు. లోకేశ్ బృందంలో తిరుగుతూ పార్టీ కార్యక్రమాల్లో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు.



✤ **జొన్నాదుల మహేశ్వర రావు:** తెనాలికి చెందిన ఈయన 1983 నుంచి తెదేపాలో ఉన్నారు. ప్రస్తుతం పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా ఉన్నారు. 2015-17లో తెనాలిలోని వైకుంఠపురం దేవస్థానం ఛైర్మన్‌గా చేశారు. సామాన్య కుటుంబం నుంచి వచ్చి పార్టీ విధేయుడిగా క్రియాశీలకంగా పని చేశారు.

✤ **బిట్రా వెంకటశివనారాయణ:** తాడికొండ మండలం కంతేరుకు చెందిన ఈయన భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పని చేస్తున్నారు. 2014 నుంచి పార్టీలో క్రియాశీలకంగా ఉన్నారు. ఈయన పనితీరును గుర్తించి భాజపా అధినాయకత్వం ఈ అవకాశం ఇచ్చింది.

✤ **పర్వతం మధుసూదనరావు:** మంగళగిరికి చెందిన ఈయన 2017 నుంచి జనసేనలో క్రియాశీలకంగా పని చేస్తున్నారు. జనసేన చేనేత వికాస విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పని చేస్తున్నారు.

ఏపీ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సభ్యులుగా....



✤ **దాసరి రాజామాస్టారు:** గుంటూరు తూర్పు నియోజకవర్గానికి చెందినవారు. తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా ఉన్నారు. 1982 నుంచి తెదేపాలో కొనసాగుతున్నారు. తెలుగు విద్యార్థి, జిల్లా ఉపాధ్యక్షుడిగా, నగర పార్టీ ప్రచార కార్యదర్శిగా, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శిగా, తెదేపా రాష్ట్ర కార్యదర్శిగా పని చేశారు. గత ఎన్నికల్లో గుంటూరు తూర్పు, నరసరావుపేట అభ్యర్థుల విజయానికి కృషి చేశారు. మాచర్ల నియోజకవర్గ పార్టీ పరిశీలకుడిగా ఉన్నారు.

✤ **వడ్రాణం మార్కండేయబాబు:** గుంటూరు తూర్పు నియోజకవర్గానికి చెందినవారు. జనసేన ఆవిర్భావం నుంచి క్రియాశీలకంగా ఉన్నారు. ప్రస్తుతం జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా పని చేస్తున్నారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా ఉంటున్నారు.

కేసుల పురోగతిపై ఎస్పీ సమీక్ష

ఈనాడు, అమరావతి: తెదేపా కేంద్ర కార్యాలయం, చంద్రబాబునాయుడు ఇంటిపై దాడి కేసుల పురోగతిపై ఎస్పీ సతీష్‌కుమార్ మంగళవారం మంగళగిరి సబ్‌డివిజన్ పోలీసు అధికారులతో సమీక్షించారు. ఈ కేసుల్లో ప్రధాన నిందితులుగా ఉన్న వైకాపా నాయకులు మాజీ మంత్రి జోగి రమేష్, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురాం, విజయవాడ వైకాపా తూర్పు సమన్వయకర్త దేవినేని అవినాష్‌ల విచారణ ఎంతవరకు వచ్చింది? ఏ మేరకు వారు సహకరించారో అడిగి తెలుసుకున్నారు. మరోవైపు సుప్రీంకోర్టులో దాఖలు చేయాల్సిన కౌంటర్‌పైనా సమీక్షించారు. నిందితులు పోలీసులకు సహకరించని వైనాన్ని సుప్రీం కోర్టుకు తెలియజేయాలనే యోచనలో పోలీసులు ఉన్నారు.

జడ్పీ సీఈవోగా జ్యోతిబసు బాధ్యతల స్వీకరణ



దస్త్రంపై సంతకం చేస్తున్న జడ్పీ సీఈవో జ్యోతిబసు

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: ఉమ్మడి గుంటూరు జిల్లాపరిషత్తు సీఈవోగా వి. జ్యోతిబసు బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ఆయన్ను సీఈవోగా ప్రభుత్వం నియమించటంతో జిల్లాపరిషత్తు కార్యాలయంలో మంగళవారం డిప్యూటీ సీఈవో జె. మోహన్‌రావు నుంచి బాధ్యతలు స్వీకరించారు. జ్యోతిబసును జడ్పీ విభాగాల ఏవోలు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినాను సీఈవో జ్యోతిబసు మర్యాదాపూర్వకంగా కలిసి మాట్లాడారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 126, రిటైల్ ధర - 148, చికెన్ విత్‌స్కిన్ - 215, చికెన్ స్కిన్‌లెస్ - 244.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -121 రిటైల్ ధర 143 చికెన్ విత్ స్కిన్ - 207, చికెన్ స్కిన్‌లెస్ - 236.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 248 చికెన్ స్కిన్‌లెస్ - 258.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 555 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.91/-.

'జమిలి ఎన్నికలు సాధ్యం కాదు'



మాట్లాడుతున్న ఏపీ కాంగ్రెస్ మీడియా కమిటీ ఛైర్మన్ డాక్టర్ ఎన్.తులసీరెడ్డి

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: భారతదేశంలో జమిలీ ఎన్నికల నిర్వహణ సాధ్యం కాదని రాజ్యసభ మాజీ సభ్యులు, ఏపీ కాంగ్రెస్ మీడియా కమిటీ ఛైర్మన్ డాక్టర్ ఎన్.తులసీరెడ్డి అన్నారు. జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో మంగళవారం రామన్నపేటలోని కార్యాలయంలో జమిలీ ఎన్నికలు అవసరమా? సాధ్యమా? అనే అంశంపై చర్చాగోష్ఠి జరిగింది. కార్యక్రమానికి వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లం రెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. తులసీరెడ్డి మాట్లాడుతూ జమిలీ ఎన్నికలు నియంతృత్వానికి దారితీస్తుందన్నారు. స్థానిక సమస్యల ప్రాధాన్యతలు తగ్గుతాయని, అవినీతి తారా స్థాయికి చేరుతుందని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐదేళ్లలో రూ.500 లక్షల కోట్ల బడ్జెట్‌లో వ్యయం చేస్తుంటే అందులో ఎన్నికల కోసం రూ.10వేల కోట్లు అనేది కేవలం 0.01 శాతం మాత్రమేనన్నారు. ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ జమిలీ అమల్లోకి రావాలంటే రాజ్యాంగంలో ప్రధానంగా ఆరు సవరణలు చేయాలన్నారు. 2022లోనే జాతీయ లా కమిషన్ జమిలీ ఎన్నికలు ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ మౌలిక నిర్మాణానికి, రాజ్యాంగ పాలన పద్ధతికి భంగకరం అని తెలిపిందన్నారు. జమిలీ ఎన్నికలకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టడానికి ప్రజా చైతన్య సదస్సులను రాష్ట్ర వ్యాప్తంగా జనచైతన్య వేదిక నిర్వహిస్తుందన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, ప్రముఖ విద్యావేత్త మేకల రవీంద్రబాబు, రాజ్యాంగ చర్చా వేదిక కన్వీనర్ అవధానుల హరి, నేస్తం సహ వ్యవస్థాపకులు టి.ధనుంజయరెడ్డి, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకులు కొరివి వినయ్‌కుమార్ తదితరులు ప్రసంగించారు.

మణిపాల్ ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స



వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ కంటిపూడి సుధాకర్

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా తాడేపల్లి మణిపాల్ ఆస్పత్రిలో విజయనగరం జిల్లాకు చెందిన ఓ బాలుడికి అరుదైన శస్త్రచికిత్స నిర్వహించినట్లు ఆస్పత్రి సంచాలకులు డాక్టర్ కంటిపూడి సుధాకర్ తెలిపారు. ఆ వివరాలను మంగళవారం విలేకరులకు వెల్లడించారు. విజయనగరం జిల్లా బొబ్బిలికి చెందిన నాలుగేళ్ల శ్రావణ్ కాలేయ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. దీనికి కాలేయ మార్పిడి తప్పా మరో మార్గం లేదు. ఇందుకు రూ.20 లక్షలు ఖర్చవుతుందని తల్లిదండ్రులకు చెప్పగా వారు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌ను ఆశ్రయించారు. బాలుడి ఆర్థిక పరిస్థితిని చూసి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి కొంత డబ్బు అందించగా, మిగిలిన సొమ్మును మణిపాల్ ఫౌండేషన్ అందించింది. దీంతో బాలుడికి డాక్టర్ టామ్ చెరియన్ శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారని, ఆస్పత్రిలో అత్యాధునిక వైద్య సౌకర్యాలున్నాయని, ఇప్పటి వరకు 70కిపైగా కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలు చేశామని సుధాకర్ తెలిపారు. బాలుడి తండ్రి కాలేయం నుంచి కొంత భాగం దానం చేయడంతో సులువుగా శస్త్రచికిత్స పూర్తి చేశామన్నారు. ఏడు రోజుల్లోనే బాలుడు పూర్తిగా కోలుకున్నాడన్నారు.

చేనేతకు పూర్వ వైభవం తెస్తాం



నేత వస్త్రాలు పరిశీలిస్తున్న జౌళి శాఖ ముఖ్యకార్యదర్శి సునీత, చిత్రంలో కమిషనర్ రేఖారాణి

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: మంగళగిరిలోని ఏపీఐఐసీ భవనంలో మంగళవారం చేనేత వస్త్ర ప్రదర్శన నిర్వహించారు. మొత్తం 30 స్టాళ్లలో జిల్లా వ్యాప్తంగా చేనేత కార్మికులు తయారు చేసిన వస్త్రాలను అందుబాటులో ఉంచారు. ప్రదర్శనశాలను జౌళి శాఖ శాఖ ముఖ్య కార్యదర్శి సునీత, కమిషనర్ రేఖారాణి పరిశీలించారు. అనంతరం సునీత మాట్లాడుతూ చేనేత వస్త్రాల కొనుగోళ్లు పెంచేందుకు ఈ ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. ఈ వస్త్రాలకు మార్కెటింగ్‌తో పాటు కార్మికుల ఆదాయం పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. మంత్రి నారా లోకేష్ సహకారంతో చేనేతకు పూర్వ వైభవం తీసుకొస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీ వనజ, ఎన్నారై తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వేమూరి రవి, రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీ దేవి, మంగళగిరి పట్టణ అధ్యక్షుడు దామర్ల రాజు, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కారంపూడి అంకమరావు, పోట్లాబత్తుని లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

చేబ్రోలులో 106.8 మి.మీ వర్షపాతం

కలెక్టరేట్(గుంటూరు), జిల్లాలో సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు సగటున 15.2 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. చేబ్రోలు మండలంలో అత్యధికంగా 106.8 మిల్లీ మీటర్లు నమోదైంది. వట్టిచెరుకూరు 53.6, తెనాలి 23, గుంటూరు పశ్చిమ 16.2, తాడికొండ 16.2, గుంటూరు తూర్పు 15.4, పెదకాకాని 12.4, పొన్నూరు 11.8, తుళ్ళూరు 9.8, ప్రత్తిపాడు 3.4, దుగ్గిరాల 2.8, పెదనందిపాడు 1.6, కాకుమాను 1 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది.

తెనాలి
•తెనాలి •పొన్నూరు



చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న ఏఎస్ఐ సాంబశివరావు

సీఎం సహాయ నిధికి ఏఎస్ఐ విరాళం

చేబ్రోలు, న్యూస్‌టుడే: చేబ్రోలు పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐ మైలా సాంబశివరావు బుడమేరు వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి తన జీతం నుంచి రూ.లక్ష చెక్కును సచివాలయంలో సీఎం చంద్రబాబు నాయుడుకు అందజేశారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ వరద బాధితుల కోసం సీఎం పడుతున్న కష్టాన్ని చూసి చలించిపోయానన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? పట్టణంలోని నిడుబ్రోలు ఎస్టీ కాలనీలో తాగునీటి కుళాయికి వాల్వు లేకపోవడంతో నీరు వృథాగా పోతోంది. **-కె.రాంబాబు, నిడుబ్రోలు**

✔ కుళాయికు వాల్వు ఏర్పాటు చేయిస్తాం. **-అపర్ణ, సహాయ ఇంజినీర్**

? పాత పొన్నూరులోని మురుగు కాలువలో వ్యర్థాలు పేరుకుపోవడంతో దుర్వాసన వస్తోంది. -లక్ష్మి కుమారి, పాత పొన్నూరు.

✔ వ్యర్థాలను తొలగించే విధంగా తగు చర్యలు తీసుకుంటా.

-శ్రీనివాసరావు, ప్రజారోగ్యశాఖాధికారి

వ్యర్థాల తొలగింపు

స్పందనకు వందనం

మేమున్నాం....మీకు తోడుగా శీర్షికన ఈనాడులో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పట్టణ పరిధి డీవీసీకాలనీలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు.-న్యూస్‌టుడే, పొన్నూరు

ఉద్యోగ భద్రత కల్పించండి

తెనాలి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం పాలసీని ఆమోదించిన నేపథ్యంలో తమ ఉద్యోగాల విషయం గందరగోళంగా మారిందని, ఇతర ప్రభుత్వ విభాగాల్లో అయినా ఒప్పంద విధానంపై తమకు అవకాశం కల్పించాలని తెనాలిలోని ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బంది కోరారు. మంగళవారం మద్యం డిపో అధికారికి ఈ మేరకు వినతిపత్రం అందించారు.

నరసింహారావుకు నివాళి

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: నాటకరంగంలో తొలి పద్మశ్రీ అవార్డు గ్రహీత, రంగస్థల నటుల స్థానం నరసింహారావు రాసి, సంగీతం సమకూర్చిన మీర జాలగలడా నా యానతి వ్రత విధాన మహిమన్ సత్యాపతి పాట బహుళ ప్రచారం పొందిందని స్వరలయ వేదిక వ్యవస్థాపకులు సాయి లక్కరాజు పేర్కొన్నారు. ఆయన మంగళవారం వేదిక కార్యాలయంలో నిర్వహించిన స్థానం వారి జయంతిలో పాల్గొన్నారు. డీసీసీబీ విశ్రాంత సీఈవో సుబ్రహ్మణ్యేశ్వరరావు, విశ్రాంత ఉపాధ్యాయులు పొన్నపల్లి గోపాలకృష్ణమూర్తి, హేమంత్ కుమార్ నరసింహారావు చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు.

కాలి బాటలే.. ప్రమాద కారకాలై..

గత వైకాపా హయాంలో కేటాయించని నిధులు



శ్రీనగర్‌కాలనీలో ఇబ్బందికరంగా..

పొన్నూరు, న్యూస్‌టుడే

పట్టణ పరిధి శ్రీనగర్‌కాలనీ, వెంకటేశ్వరనగర్ శివారు, డీవీసీ కాలనీకి వెళ్లే మార్గం, 29వ వార్డు, నిడుబ్రోలు తదితర ప్రాంతాల్లో ప్రజలు, ద్విచక్ర వాహనాలు, రాకపోకలు నిర్వహించేందుకు కాలిబాట వంతెనలు నిర్మించారు. వంతెనలు కొన్ని కాలం చెల్లడంతో ప్రమాదకరంగా మారాయి. కొన్ని శ్లాబులు అక్కడక్కడ పగుళ్లిచ్చి పెచ్చులుగా రాలి పడుతున్నాయి. ఆ వంతెనల అడుగు భాగం దెబ్బతినడంతో ఏ క్షణంలో నేలకు కూలుతాయోనని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. కొన్ని వంతెనలకు రెండు వైపులా నిర్మించిన సైడ్ వాల్స్ విరిగిపోయాయి. అవి లేకపోవడంతో ఎదురెదురు వాహనాలు వచ్చినప్పుడు అంచు చివరికి వెళ్తే సరికి ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని వాహనదారులు భయపడుతున్నారు. గతంలో కొన్ని సందర్భాల్లో వాహనాలు అదుపుతప్పి కాలువలో బోల్తాపడిన ఘటనలు ఉన్నాయి. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పొన్నూరు పట్టణంలో	
వార్డులు	: 31
కుటుంబాలు	: 18,005
జనాభా	: 61,500
కాలి బాట వంతెనలు	: 30



ముబారక్‌నగర్: పగుళ్లిచ్చిన వంతెన



వెంకటేశ్వరనగర్‌లో చెక్క వంతెనపై నుంచి రాకపోకలు

పనులు మరిచారు...

గత వైకాపా ప్రభుత్వ హయాంలో శ్రీనగర్ కాలనీలోని కాలిబాట వంతెనకు రెండు వైపులా రహదారి దెబ్బతింది. వంతెన ప్రమాదకరంగా మారడని స్థానికులు ఫిర్యాదు చేయడంతో అప్పటి ఇంజినీరింగ్ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి నూతన కాలి బాట వంతెనకు రూ.3 లక్షల నిధులు కేటాయించామని వెల్లడించారు. మూడు సంవత్సరాలు గడిచినా వంతెన నిర్మాణ పనులు ప్రారంభించలేదు. స్థానికులు రాకపోకల నిర్వహించడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. గతంలో తెదేపా అధికారంలో ఉన్నపుడు శ్రీనగర్ కాలనీలో మూడు కాలి బాట వంతెనలకు రూ.9 లక్షలు నిధులు మంజూరు చేసినప్పటికీ ప్రభుత్వం మారడంతో వాటి నిర్మాణ పనులు కాగితాలకే పరిమితం చేశారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం..

దీనిపై పురపాలక సంఘం సహాయ ఇంజినీర్ అపర్ణను న్యూస్‌టుడే వివరణ కోరగా వంతెనలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

25,26 తేదీల్లో స్వర్ణాంధ్ర -2047 కార్యక్రమంపై సభలు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: స్వర్ణాంధ్రప్రదేశ్- 2047 కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు 25, 26 తేదీలలో పట్టణంలో వార్డు సభలు నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. ఆయన మంగళవారం కౌన్సిల్ హాలులో మున్సిపల్ అధికారులు, ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా 40 వార్డుల్లో సదస్సుల నిర్వహణకు కేటాయించిన అధికారుల షెడ్యూల్ వివరాలను ఆయన వివరించారు. హౌసింగ్ ఈఈ భాస్కరరావు, మున్సిపల్ సహాయ కమిషనర్ వి. లక్ష్మీపతిరావు పాల్గొన్నారు.

మూల మంత్రాలతో హోమం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ఆంధ్ర వాల్మీకి శ్రీవాసుదాసు స్వామి పరంపర పీఠం దాసుకుటి, అంగలకుదురులో మంగళవారం శ్రీరామమంత్రం లక్ష్మీగణపతి సుదర్శన లక్ష్మి నరసింహస్వామి తదితర మూల మంత్రాలతో వేద పండితులు హోమం నిర్వహించారు. 108 మార్లు హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది. ఉలిచి సీతారామ శర్మ పట్టాభి పర్యవేక్షించారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

పెదకాకాని, న్యూస్‌టుడే: తక్కెళ్లపాడులోని చౌడేశ్వరీదేవి కల్యాణ మండపంలో బుధవారం ఉదయం 9 గంటలకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు శంకర కంటి ఆసుపత్రి నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరానికి వచ్చే వారు ఆధార్, రేషన్‌కార్డుల నకళ్లను తీసుకురావాలన్నారు.

దేవాలయ ఉప కమిషనర్ బాధ్యతల స్వీకరణ



పెదకాకాని: పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవాలయ ఉప కమిషనర్‌గా జీవీడీఎన్ లీలా కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన విజయవాడ దుర్గగుడి నుంచి బదిలీపై ఇక్కడి వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఉప కమిషనర్‌గా ఉన్న శ్రీరామ వరప్రసాదరావు కృష్ణా జిల్లా మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానానికి బదిలీపై వెళ్లారు.

నాణ్యమైన ఆహారం అందించాలి

పొన్నూరు, న్యూస్‌టుడే: విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఎంఈవో ఎవీఎం. ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం పొన్నూరు మండల పరిషత్తు కార్యాలయంలో ప్రధానోపాధ్యాయుల నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ ఉన్నత అధికారులు జారీ చేసిన ఆదేశాలను ప్రతి ఒక్కరూ తప్పని సరిగా పాటించాలని కోరారు. ప్రతి విద్యార్థి ఆధార్‌ను అనుసంధానం చేయాలని సూచించారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



పెదకాకాని: కరపత్రాలు ఇస్తున్న మన్నవ సుబ్బారావు, నాయకులు



పొన్నూరు: మురుగునీటి కాలువను పరిశీలిస్తున్న కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు

పెదకాకాని, న్యూస్‌టుడే: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని తెదేపా నియోజకవర్గ పరిశీలకుడు, మిర్చి యార్డు మాజీ ఛైర్మన్ మన్నవ సుబ్బారావు తెలిపారు. అగతవరప్పాడులో మంగళవారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఇంటింటికీ తిరుగుతూ వంద రోజుల పాలనలో కూటమి ప్రభుత్వం నెరవేర్చిన హామీలు, వరద బాధితులు, రైతులకు సీఎం చంద్రబాబు, స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అండగా నిలిచారని వివరించారు. నాయకులు గోళ్ల ప్రభాకర్, తాళ్ల శ్రీనివాసరావు, నల్లపనేని అమర్‌నాథ్ బాబు, డేరంగుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పొన్నూరు, న్యూస్‌టుడే: పట్టణ ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు అధిక ప్రాధాన్యం కల్పిస్తానని కమిషనర్ ముప్పాళ్ల రమేష్ బాబు పేర్కొన్నారు. మంగళవారం పట్టణ పరిధిలోని 18,19 వార్డుల్లో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొని సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

మున్సిపల్ కార్మికులకు అభినందనలు



మహిళలకు నమూనా చెక్కు పంపిణీ చేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: వరదల్లో విజయవాడలో 12 రోజుల పాటు విధులు నిర్వహించిన తెనాలి పురపాలక సంఘ కార్మికులకు సీఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో నూతన వస్త్రాలు అందించారు. తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రి నాదెండ్ల మనోహర్ 115 మంది కార్మికులకు వాటిని అందించి అభినందనలు తెలిపారు. వరద విపత్తు సమయంలో సీఎం పనితీరు ఆదర్శనీయమన్నారు. తెనాలిలో పేద ప్రజల ఇళ్ల కోసం నిర్మాణాలు చేపట్టిన రెండు పెద్ద కాలనీల్లో అనేక అవకతవకలు చోటు చేసుకున్నాయని, వాటి అన్నింటిని అధిగమిస్తూ మార్చి నెలాఖరు నాటికి ఇళ్లు అందించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. మున్సిపల్ కమిషనర్ బి.శేషన్న, మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, సబ్ కలెక్టర్ సంజనా సింహ, ఓఎస్‌డీ ఏసురత్నం, డీఎస్పీ జనార్దనరావు, తహసీల్దార్ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

కొల్లిపర: సంక్షోభ పరిస్థితుల్లో సంక్షేమాన్ని అందించటం కూటమి ప్రభుత్వానికే సాధ్యమని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మన మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం కొల్లిపరలో నిర్వహించిన మహిళా సదస్సులో ఆయన మాట్లాడారు. వెలుగు సిబ్బంది రూ.100 కోట్ల రుణసాయం లక్ష్యంతో విధులు నిర్వహించాలని సూచించారు. 170 మహిళా సంఘాలకు రూ.24 కోట్ల రుణసాయం చెక్కును మంత్రి మహిళలకు అందించారు. పొలం పిలుస్తోంది గోడప్రతులను ఆవిష్కరించారు. మహిళలకు డ్రోన్ల వినియోగంలో శిక్షణనిచ్చి రూ.పదిలక్షల నిధులతో పది మందికి డ్రోన్లను పంపిణీ చేస్తామన్నారు. జిల్లా వ్యవసాయశాఖా అధికారి నున్న వెంకటేశ్వర్లు, ఏడీఏ ఎన్.ఉషారాణి, ఏవో వెంకటరావు, జిల్లా ఉద్యాన శాఖాధికారి రవీంద్రబాబు, ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దార్ సిద్ధార్థ, నాయకులు యర్రువెంకయ్యనాయుడు, అడపా నారాయణరెడ్డి, ఆళ్లవీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు నగదు పురస్కారాలు



క్రీడాకారిణికి నగదు పురస్కారాన్ని అందజేస్తున్న వీసీ ఆచార్య గంగాధర్

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలోని వివిధ కళాశాలలో క్రీడలలో రాణించినవారికి ఇన్‌ఛార్జి వీసీ గంగాధర్ మంగళవారం నగదు పురస్కారాలను అందజేశారు. రెక్టార్ ఆచార్య రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, ప్రిన్సిపల్ ఆచార్య పాల్‌కుమార్ మాట్లాడారు. ఈ ఏడాది చివర్లో అంతర్ విశ్వవిద్యాలయాల వెయిట్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పాల్‌కుమార్ ప్రకటించారు. ప్యారిస్ ఒలింపిక్‌లో పాల్గొన్న వై.జ్యోతికి ప్రకటించిన లక్ష నగదు పురస్కారాన్ని సీడీఈ సంచాలకులు ఆచార్య వెంకటేశ్వర్లు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య జాన్సన్, డాక్టర్ ఇన్నయ్య, డాక్టర్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలి

పొన్నూరు, న్యూస్‌టుడే: వరిలో అన్నదాతలు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించే ప్రక్రియలో భాగస్వాములు కావాలని లాం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త పి.అమరజ్యోతి పేర్కొన్నారు. మండలంలోని కట్టెంపూడి, పచ్చల తాడిపర్రు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ సునీత, ఏడీఏ రామకోటేశ్వరి, ఏఓ డేగల వెంకట రామయ్య పాల్గొన్నారు.

తెనాలి టౌన్: కొలకలూరు, గోవాడ గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.

పెదకాకాని: రైతులు సాంకేతిక పద్ధతుల్లో వ్యవసాయం చేయటం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. తక్కెళ్లపాడు, రామచంద్రపాలెం గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు.

చేబ్రోలు: చేబ్రోలు, వేజండ్ల గ్రామాల్లో పొలం పిలుస్తోందిలో లాం శాస్త్రవేత్త డాక్టర్ అమరజ్యోతి, పశుసంవర్ధకశాఖ డీడీ బాల శివకిషోర్ పాల్గొన్నారు.

ఘనంగా సత్య శోధక్ సమాజ్

ఎ.ఎన్.యు: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని మహాత్మ జ్యోతిరావు పులే అధ్యయన కేంద్రంలో మంగళవారం సత్య శోధక్ సమాజ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య త్రిమూర్తిరావు మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిభాయి పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు ఆచార్య వీరయ్య, ఆచార్య స్వరూపారాణి, ఆచార్య ప్రమీలారాణి పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగుల డిప్యుటేషన్లు రద్దు

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ హయాంలో సాధారణ బదిలీల సందర్భంగా తెనాలి నుంచి ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్ బదిలీపై రేపల్లె, గూడూరు మున్సిపాలిటీలకు వెళ్లారు. అప్పటి తెనాలి కమిషనర్ అభ్యర్థన మేరకు మున్సిపల్ ఆర్డీ జూనియర్ అసిస్టెంట్‌ని డిప్యుటేషన్‌పై తెనాలికి పంపించారు. మరో ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు వ్యక్తిగత అభ్యర్థన మేరకు ఇక్కడ డిప్యుటేషన్‌పై నియమించారు. విమర్శలు రావడంతో ఈ డిప్యుటేషన్లపై తెనాలి, రేపల్లె కమిషనర్లు మున్సిపల్ ఆర్డీని లిఖిత పూర్వకంగా కోరగా.. మంగళవారం వాటిని రద్దు పరిచారు. సదరు ఉద్యోగులను తక్షణమే విధుల నుంచి రిలీవ్ చేయాలని కమిషనర్లను ఆదేశించారు.

పలువురు బదిలీ

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: తెనాలి పురపాలక సంఘంలోని ఆర్వో సోమశేఖర్ యాదవ్ గూడూరు మున్సిపాల్టీకి, డీఈఈ కె.నాగభూషణం గుంటూరు కార్పొరేషన్‌కు, ఏసీపీలు సుధాకర్, సుబ్బారావు ఒంగోలు కార్పొరేషన్, సీఆర్డీఏకు, టీపీఓ సునీల్ కందుకూరు మున్సిపాల్టీకి బదిలీ అయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులు అందినట్లు మున్సిపల్ అధికారులు మంగళవారం తెలిపారు.

నంబూరులో 'స్వచ్ఛతా హీ సేవ

నంబూరు(పెదకాకాని), న్యూస్‌టుడే: వీవీఐటీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మంగళవారం నంబూరులో 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమం నిర్వహించారు. ప్లాస్టిక్ వస్తువుల వినియోగం తగ్గించాలని, కాలుష్య రహిత సమాజాన్ని భావితరాలకు అందించాలని అవగాహన కల్పించారు. అనంతరం గ్రామస్థులకు 'క్లాత్ బ్యాగ్స్'ను పంపిణీ చేశారు. గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహాన్ని శుభ్రపరచడంతో పాటు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛతపై అవగాహన కల్పించి 'స్వచ్ఛతా హీ సేవా' ప్రతిజ్ఞ చేయించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి భక్తాసింగ్ పాల్గొన్నారు.

సామాజిక, ఆర్థిక అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న జేసీ భార్గవ్ తేజ

పొన్నూరు, న్యూస్‌టుడే: సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రతి విద్యార్థి కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ అన్నారు. మంగళవారం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాజంలో ఆర్థిక అసమానతలను తొలగించడానికి విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. విజయవాడ వరద సహాయక చర్యల్లో పాల్గొన్న విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో మంగళవారం ఎన్ఎస్ఎస్ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్ మాట్లాడుతూ కృష్ణానది పుష్కరాల సమయంలో ఏఎన్‌యూ ఎన్ఎస్ఎస్ సేవలు చిరస్థాయిగా నిలిచాయని తెలిపారు. విజయవాడ వాసవ్య మహిళా మండలి ప్రెసిడెంట్ డాక్టర్ కీర్తి, ఎన్ఎస్ఎస్ విభాగం సమన్వయకర్త దివ్యతేజోమూర్తి మాట్లాడారు. ఉత్తమ సేవలందించిన వారికి వీసీ పురస్కారాలు అందజేశారు. రెక్టార్ ఆచార్య రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, ఓఎస్‌డీ రవికుమార్, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటరుపై దాడి కేసు గుంటూరుకు మార్పు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: సార్వత్రిక ఎన్నికల సమయంలో పట్టణ ఐతానగర్‌లోని పోలింగ్ బూత్‌లో ఓటరుపై అప్పటి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, అనుచరులు దాడి చేసిన కేసు గుంటూరు న్యాయస్థానానికి బదిలీ అయింది. ఎన్నికల నేపథ్యంలో నమోదైన కేసులన్నీ గుంటూరు న్యాయస్థానానికి బదిలీ అయ్యే ప్రక్రియలో ఈ కేసు కూడా బదిలీ అయిందని తెనాలి రెండో పట్టణ పోలీసులు మంగళవారం తెలిపారు.

భాగస్వామి మోసంపై ఫిర్యాదు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: మైనింగ్ వ్యాపారంలో భాగస్వామిగా ఉన్న తెలంగాణ వాసి మోసం చేశారని పట్టణ నందులపేటకు చెందిన వ్యాపారి న్యాయస్థానాన్ని ఆశ్రయించగా చట్టప్రకారం ముందుకు వెళ్లాలన్న ఆదేశాలు స్థానిక పోలీస్ స్టేషన్‌కు మంగళవారం చేరాయి. పోలీసులు వివరాలు పరిశీలిస్తున్నారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి (50) ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానిక మొండి గోడల వద్ద జరిగిందని తెనాలి రైల్వే పోలీసులు మంగళవారం తెలిపారు. మృతదేహాన్ని వైద్యశాలకు తరలించి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు



నిందితుడితో సీఐ శ్రీనివాసరావు, పోలీసులు

కొల్లిపర, న్యూస్‌టుడే: కొల్లిపరకు చెందిన అమిరే ఆనంద్‌కిషోర్ ఉరఫ్ చోటును స్థానిక దావులూరు అడ్డరోడ్డులో మంగళవారం అరెస్టు చేసినట్లు తెనాలి రూరల్ సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు. నిందితుడి నుంచి ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఐటీఐ చదివిన అతనిపై రెండేళ్ల కాలంలో 15 కేసులు నమోదయ్యాయని, అయినా నిందితుడిలో మార్పురాలేదన్నారు. బెయిల్‌పై వచ్చి దొంగతనాలు చేస్తున్నాడని పేర్కొన్నారు. కేసు పరిష్కారంలో ఎస్సై పి.కోటేశ్వరరావు, ఏఎస్ఐ పోతురాజు, నాగబాబు కృషిని అభినందించారు. విద్యార్థి దశలోనే చెడువ్యసనాలకు బానిసలైన కొందరు యువకులు జల్సాలకోసం దొంగతనాలకు పాల్పడుతున్నారని సీఐ పేర్కొన్నారు.

మంత్రి మాట ప్రకారం.. బస్టాండ్ ఆవరణ బాగు

న్యూస్‌టుడే, తెనాలి టౌన్

గత ఐదేళ్ల వైకాపా పాలనలో తెనాలి బస్టాండ్లో మౌలిక సదుపాయాల కల్పనను ఏ మాత్రం పట్టించుకోలేదు. ఫలితంగా బస్సులు నిలిచే ఫుట్‌పాత్‌ల మొదలు అంతర్గత ఆవరణ అంతా గోతులుగా మారింది. ఈ తీరు వల్ల ప్రయాణికులకు ఇబ్బందితో పాటు బస్సులూ సైతం పాడైపోయేవి. లోతట్టుగా ఉండటంతో చిన్న పాటి వాన పడిన ప్రతిసారి బస్టాండ్ ఆవరణ చెరువుగా మారేది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జులై 8వ తేదీన తెనాలి ఎమ్మెల్యే, మంత్రి నాదెండ్ల మనోహర్ బస్టాండ్‌కు వచ్చి నూతన బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఆవరణను పరిశీలించి నెల రోజుల్లో పనులు ప్రారంభిస్తామని మాట ఇచ్చారు. ఈ విధంగా ఆగస్టులో బస్టాండ్ ప్రాంగణంలోని కొల్లిపర బస్సులు నిలిచే ప్రధాన ప్రాంతంలో కాంక్రీట్ రోడ్డు నిర్మాణం రూ.14.9 లక్షలతో ప్రారంభమై ఇటీవల పూర్తి అయింది. మంత్రి ఆదేశాలతో రూ.74 వేలతో 5 హెచ్‌పీ మోటారును బిగించామని, భారీ వర్షం పడినా ఆవరణలో నిలిచిన నీటిని వీలైనంత త్వరగా వెలుపలికి పంపే ఏర్పాట్లు చేశామని డిపో మేనేజర్ రాజశేఖర్ తెలిపారు. రెండో దశలో మిగిలిన ఆవరణలోనూ పనులు ప్రారంభంకానున్నాయని పేర్కొన్నారు.



వైకాపా పాలనలో బస్టాండ్ ఆవరణ ఇలా..



కూటమి ప్రభుత్వంలో ఇప్పుడిలా..

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

గండి పూడ్చారు

వట్టిచెరుకూరు: కొర్నెపాడులోని జగనన్న కాలనీకి వెళ్లే పంచాయతీ రాజ్ రోడ్డుకు ఇటీవల కురిసిన వరదలతో ఏర్పడిన గండిని ఏఈ హుస్సేన్‌రావు మంగళవారం పూడ్చించారు. గండి ఏర్పడటంతో ఈమార్గంలో వాహనాల రాకపోకలు ఆగిపోయాయి. దాంతో ఈ నెల 23న 'ఈనాడు'లో రహదారి కోత అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఏఈ రాతి పొడుముతో మరమ్మతులు చేయించారు.

ఈనాడు కథనానికి స్పందన



బాగుచేసిన తర్వాత ఇలా..

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మంగళగిరి: 80085 73111 ప్రత్తిపాడు: 99596 89564 తాడికొండ: 97053 99233

? తాడికొండ వేణుగోపాలస్వామి ఆలయం వద్ద మురుగునీరు రోడ్డుపై చేరుతోంది. దుర్వాసన వ్యాపిస్తోంది.- **పవన్, గ్రామస్థుడు**

✔ మురుగు కాలువలో ఎప్పటికప్పుడు పూడిక తీయించి, బ్లీచింగ్ జల్లిస్తాం. - **శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శి**

? అనంతవరప్పాడులో ఆంజనేయస్వామి దేవాలయం వెనక బజారులో మురుగునీరు తరలింపునకు కాలువలు లేకపోవడంతో నివాసాలనుంచి వచ్చే మురుగునీరు రహదారిపై ఉంటుంది.

- రంగారావు, స్థానికుడు

✔ త్వరలో కాలువలు నిర్మించి స్థానికులకు ఇబ్బందులు రాకుండా చూస్తాం. - **జి.వెంకటరావు, సర్పంచి**

– న్యూస్‌టుడే, వట్టిచెరుకురు

చిరుధాన్యాలతో వంటల తయారీపై శిక్షణ

కొర్నెపాడు (వట్టిచెరుకూరు) న్యూస్‌టుడే: కొర్నెపాడులో రైతు నేస్తం ఫౌండేషన్, కర్షక్ సేవాకేంద్రాల సంయుక్త నిర్వహణలో సెప్టెంబర్ 29 నుంచి మూడు రోజులపాటు చిరు ధాన్యాలతో రుచికరమైన పిండివంటలు తయారీపై శిక్షణ ఉంటుందని ఫౌండేషన్ ఛైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. ఇతర వివరాలకు 9705383666ను సంప్రదించాలని తెలిపారు.

మంత్రి లోకేశ్ చొరవతో బోర్లకు మరమ్మతులు

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో తాడేపల్లిలోని 7, 10వ వార్డులో బోర్లకు నగర పాలక సంస్థ అధికారులకు మరమ్మతులు నిర్వహించారు. 7వ వార్డులోని బొగ్గిళ్లు, 10వ వార్డులోని వడ్డెర బజారులో తాగు నీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయని ప్రజలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాలతో అధికారులు మంగళవారం మరమ్మతులు నిర్వహించారు. అనంతరం తాగునీరు పుష్కలంగా రావడంతో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



గొప్పలు చెప్పారంతే..!

జగనన్న కాలనీల్లో సౌకర్యాల లేమి

అయోమయస్థితిలో లబ్ధిదారులు

ప్రాంతం	బడేపురం
కేటాయించిన ప్లాట్లు	725
పూర్తయిన నిర్మాణాలు	0

తాడికొండ, న్యూస్‌టుడే

వైకాపా ప్రభుత్వంలో పేద లందరికీ పక్కా ఇళ్లు అని క్షేత్ర స్థాయిలో ఊదరగొట్టారు. జనావాసాల దూరంగా లేఔట్లు కేటాయించి.. అట్టహాసంగా పట్టాలిచ్చి చేతులు దులుపుకొన్నారు. మౌలిక సదుపాయాలు లేకపోవడం, రవాణా మార్గాలు అంతంత మాత్రంగా ఉండడంతో నిర్మాణాలు ప్రారంభించేందుకు లబ్ధిదారులు ముందుకు రాని పరిస్థితి నెలకొంది. తాడికొండ మండలం బడేపురం గ్రామ శివారులో పేదలకు 725 ప్లాట్లు కేటాయించారు. కానీ తాగునీరు, రోడ్లు, విద్యుత్తు తదితర ప్రాథమిక సౌకర్యాలు కూడా కల్పించకపోవడంతో ఒక్కరు కూడా ఇంటి నిర్మాణం మొదలు పెట్టలేదు. పేదలందరికీ ఇళ్లు ఇచ్చేశామని గొప్పలు చెప్పడమే కానీ తమకు చేకూరిన లబ్ధి ఏమీ లేదని ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

వర్షం వస్తే చెరువులే..

కాలనీకి నిర్మాణ సామగ్రి తరలించేందుకు సరైన రహదారి సదుపాయం లేదు. ఇక లేఔట్ పల్లంగా ఉండడంతో వర్షమొస్తే మునకేస్తోంది. ప్రస్తుతం ఆ ప్రాంతమంతా పిచ్చిమొక్కలు పెరిగి ప్రస్తుతం చిట్టడవిని తలపిస్తోంది. ఊరికి దూరంగా ఉండటంతో నివాసయోగ్యంగా లేదని లబ్ధిదారులు చెబుతున్నారు. దీనిపై హౌసింగ్ ఏఈ ఓబుల్ రెడ్డి 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ నిధుల కేటాయింపునకు ప్రభుత్వానికి నివేదిక పంపామని మంజూరు కాగానే సదుపాయాలు కల్పిస్తాం.



పిచ్చిమొక్కలతో చిట్టడివి తలపిస్తున్న జగనన్న ప్లాట్లు

నిర్మానుష్య ప్రాంతంలో స్థలాలా..?

భర్త చనిపోయారు. ఇద్దరు మగపిల్లలను కష్టపడి చదివిస్తున్నా. సొంత ఇళ్లు కట్టుకోవాలని నాకల. వైకాపా ప్రభుత్వంలో నిర్మానుష్య ప్రాంతంలో స్థలం కేటాయించారు. కనీసం రహదారి సదుపాయం లేదు. ప్రస్తుతం కంప చెట్లు పెరిగి ఎవరి ప్లాటు ఎక్కడుందో తెలియడం లేదు. **-విజయ, తాడికొండ**

నీళ్లు కొనుక్కోవాల్సి వస్తోంది

గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఇంటి స్థలం ఇచ్చారు. కానీ వసతులు కల్పించలేదు. ఇంటి కట్టుబడికి రూ. 800 ఖర్చు చేసి ట్యాంకర్‌తో నీళ్లు కొనాల్సిన పరిస్థితి. లక్షల రూపాయలు తెచ్చి ఇల్లు కట్టే స్తోమత లేదు. లబ్ధిదారులందరి పరిస్థితి ఇంతే. **-శివపార్వతి, తాడికొండ**

రహదారుల మరమ్మతులకు నిధులు

కాకుమాను, న్యూస్‌టుడే: గత వైకాపా హయాంలో కాకుమాను నుంచి కొమ్మూరు మధ్య 4 కిలో మీటర్ల రహదారి భారీ గుంతలు పడి అధ్వానంగా తయారైంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రోడ్ల మరమ్మతులపై దృష్టి సారించింది. కాకుమాను -కొమ్మూరు రోడ్డు మరమ్మతులకు రూ. 1.85 కోట్లు , బీకేపాలెం వెళ్లే రహదారి మరమ్మతులకు రూ. 82 లక్షలు, పుసులూరు రహదారికి రూ. 25 లక్షలు, రేటూరు నుంచి అప్పికట్ల వెళ్లే రహదారికి రూ. 25 లక్షలు చొప్పున నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందుకు కృషి చేసిన ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ప్రజలు కృతజ్ఞతలు చెబుతున్నారు. ప్రస్తుతం ఆ పనులు టెండరు దశలో ఉన్నట్లు ఏఈ రాంబాబు తెలిపారు.

నూతన ఎంపీడీవోగా యుగకీర్తి



కాకుమాను, న్యూస్‌టుడే: ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి అందరితో కలసి పని చేస్తామని ఎంపీడీఓ కొండా యుగకీర్తి అన్నారు. కాకుమాను ఎంపీడీఓగా మంగళవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఆమె ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు.

పెదనందిపాడుకు లక్ష్మీదేవి..



పెదనందిపాడు, న్యూస్‌టుడే: పెదనందిపాడు ఎంపీడీవోగా జి.లక్ష్మీదేవి మంగళవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈమె బాపట్ల జిల్లా సంతమాగులూరు నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఈవోపీఆర్డీ సాయిలీల, ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా వ్యవహరించారు.

మేడికొండూరుకు చందన..



మేడికొండూరు, న్యూస్‌టుడే: మేడికొండూరు మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిగా మంగళవారం చందన బాధ్యతలు స్వీకరించారు. గతంలో పని చేసిన ప్రభాకర్ బదిలీ అయ్యారు. ప్రకాశం జిల్లా మార్కాపురంలో ఎంపీడీవోగా పని చేస్తున్న ఆమె ఇక్కడికి వచ్చారు.

'జగన్‌కు మేలు చేసే మనసు లేదు'

వల్లపాడు(వట్టిచెరుకూరు): పేదలకు మేలు చేసే మనసు, సాయం అందించే చేతులు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లేవని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. వట్టిచెరుకూరు మండలం వల్లపాడులో కూటమి ప్రభుత్వం వందరోజుల పాలనను పురస్కరించుకుని నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో చెప్పిన విధంగా పింఛను రూ. 4వేల చొప్పున అందించారని చెప్పారు. అనంతరం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని వ్యవసాయ సమాచారంపై రూపొందించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఎంపీడీవో రత్నం, జనసేన ప్రత్తిపాడు ఇన్‌ఛార్జి కొర్రపాటి నాగేశ్వరరావు, నాయకులు ఎం. పూర్ణచంద్రరావు, సర్పంచి జె. వెంకాయమ్మ, ఎంపీటీసీ ఎ. అపర్ణ ఉన్నారు.

అభినందనల వెల్లువ




నందం అబద్దయ్య, తోట పార్థసారథిలను అభినందిస్తున్న ఎమ్మెల్సీ అనురాధ

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన నందం అబద్దయ్య, ఏపీ సివిల్ సప్లయ్ కార్పొరేషన్ సభ్యుడిగా నియమితులైన తోట పార్థసారథిలను తెలుగుదేశం పార్టీ నేతలు ఘనంగా సత్కరించారు. పదవుల జాబితా వెలువడిన వెంటనే మంగళగిరిలోని ఎంఎస్ఎస్ భవనం వద్ద కార్యకర్తలు బాణాసంచా కాల్చి సంబరాలు చేశారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు. ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు దామర్ల రాజు, ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, సీనియర్ నాయకులు సంకా బాలాజీ గుప్తా, మాదాల రమేష్, జవ్వాది కిరణ్ చంద్, గాజుల శ్రీను, గుంటి నాగరాజు, వడవల మహేష్, గుత్తికొండ ధనుంజయ్, రంగిశెట్టి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన చమల్లమూడి తెదేపా నేతలు

చమల్లమూడి(వట్టిచెరుకూరు): మండలంలోని చమల్లమూడిలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు సమక్షంలో చేపడుతున్న సమగ్ర అభివృద్ధిని తెదేపా నాయకులు మంత్రి నారాలోకేష్‌కు సోమవారం రాత్రి వివరించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వందరోజులు పరిపాలన విజయవంతంగా పూర్తయిన సందర్భంగా తెదేపా నేతల బృందం లోకేశ్‌ను కలిసి గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను వెల్లడించారు. నాయకులు పూర్ణచంద్రరావు, బాలమురళీకృష్ణ, రాజేంద్రప్రసాద్ తదితరులు ఉన్నారు.



మంత్రి లోకేశ్‌తో మాట్లాడుతున్న నాయకులు

'గ్రామ సచివాలయ ఉద్యోగులూ.. తీరు మార్చుకోండి'

మేడికొండూరు, న్యూస్‌టుడే: 'గత ప్రభుత్వం హయాంలో గ్రామ సచివాలయ ఉద్యోగులు ఇష్టారీతిన వ్యవహరించారు. తీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవు' అని తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ హెచ్చరించారు. మండలంలోని పేరేచర్లలో మంగళవారం సాయంత్రం 'ఇది మంచి ప్రభుత్వం'లో భాగంగా గ్రామ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రమంతటా ఒకే రోజు గ్రామ సభల నిర్వహణకు శ్రీకారం చుట్టిన ఘనత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కే దక్కిందన్నారు. ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. పేరేచర్ల గ్రామంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలని స్థానిక మండల మాజీ ఉపాధ్యక్షుడు పాములపాటి శ్రీనివాసరావు కోరారు. కార్యక్రమంలో తెదేపా, జనసేన, భాజపా నాయకులు పాల్గొన్నారు.



పేరేచర్లలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

కూటమి హయాంలో అన్ని వర్గాల్లో ఆనందం

ఎ.ఎన్.యు, దుగ్గిరాల: కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా జీవిస్తున్నారని శాసనమండలి సభ్యురాలు పంచుమర్తి అనురాధ పేర్కొన్నారు. మంగళవారం తాడేపల్లిలో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి అనురాధ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. దీనిపై రూపొందించిన గోడపత్రికను ఎమ్మెల్సీ ఆవిష్కరించారు. కూటమి ప్రభుత్వం వంద రోజులలో సాధించిన ప్రగతిని వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అనుభవం, పాలనదక్షతతో రాష్ట్రాన్ని అప్పుల ఊబి నుంచి బయటపడేసే చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. జగన్ హయాంలో సొంత తల్లికి, చెల్లికి రక్షణ లేకుండా పోయిందని విమర్శలు గుప్పించారు. తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు, పార్టీ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్లు వెంకటేశ్వరరావు, రాము, భాస్కర్, పెంచలయ్య, గోపాలరావు, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ★ దుగ్గిరాల మండలం శృంగారపురం సర్పంచి కొండూరు సుధారాణి, తెదేపా నాయకుడు మొవ్వ చంద్రశేఖరరావు ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలు పంపిణీ చేశారు.



తాడేపల్లిలో గోడపత్రిక ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ అనురాధ తదితరులు

పురస్కారాల ప్రదానం

తుళ్లూరు, న్యూస్‌టుడే: భారీ వర్షాలు, వరదల కారణంగా ఈ నెల 5న వాయిదా పడిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం ఏపీ-యూనివర్సిటీ ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా బోధన, పరిశోధన, వర్శిటి అభివృద్ధికి దోహదపడుతున్న పలువురు ప్రొఫెసర్లను అవుట్ స్టాండింగ్ ఫ్యాకల్టీలుగా వర్సిటీ యాజమాన్యం ఎంపిక చేసి సత్కరించి ఒక్కొక్కరికీ రూ. 50 వేల నగదు పారితోషికం, జ్ఞాపికలను అందజేసి గౌరవించారు. ఇన్‌ఛార్జి వీసీ డాక్టర్ సీ.వీ టామి, ముఖ్య సలహాదారు ఆచార్య వజ్జా సాంబశివరావు, రిజిస్ట్రార్ డా. ఆర్. ప్రేమకుమార్, డీన్‌లు భరద్వాజ్, విష్ణుపథ్‌లు అవార్డులు ప్రదానం చేశారు. బయోలాజికల్ సైన్స్ విభాగానికి చెందిన సుదర్శన్ గోవిందరాజన్‌కు ప్రొఫెసర్ వి.ఎస్.రావు ఫౌండేషన్ ద్వారా ప్రతిష్ఠాత్మక హెచ్‌బీ తివారి బెస్ట్ ఫ్యాకల్టీ అవార్డు ఇచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్‌లు శివరంగన్, అసోసియేట్ డైరెక్టర్ రేవతి బాలక్రిష్ణన్, డా. వినాయక్, రంజిత్ థాపా పాల్గొన్నారు.



అవార్డులు అందుకున్న ప్రొఫెసర్లతో వర్సిటీ ప్రతినిధులు

2047 విజన్ ప్లాన్‌పై ప్రజాభిప్రాయ సేకరణ

ఎ.ఎన్.యు: తాడేపల్లి నవోదయ కాలనీలో ఎంటీఎంసీ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర-2047 విజన్ ప్లాన్‌పై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఏడాదికి 15శాతం వృద్ధి సాధించాలనే లక్ష్యంతో ఈ ప్లాన్‌ను రూపొందించామని ఉప కమిషనర్ శ్రీకాంత్ చెప్పారు. దీనిపై ప్రజలు తమ అభిప్రాయాన్ని తెలియజేయాలని కోరారు. అభివృద్ధిలో ప్రజలంతా భాగస్వామ్యం కావాలనే ఉద్దేశంతో దీనిని రూపొందించామన్నారు. ప్రభుత్వం రూపొందించిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసుకొని అందులో వచ్చే ప్రశ్నలను పూర్తిచేసి అందులోనే అప్‌లోడ్ చేయాలని చెప్పారు. అప్‌లోడ్ చేసిన తర్వాత సీఎం చిత్రంతో కూడిన సర్టిఫికెట్ వస్తోందన్నారు. దీనిని ప్రజలు ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి తెదేపా నేతలు అన్నె కుసుమా, అంబటి తిరుపతిరావు, కోగంటి వెంకటేశ్వరరావు, చిన్నాబోతుల చిన్నా, దొంతిరెడ్డి సాంబిరెడ్డి, గొర్ల వేణు పాల్గొన్నారు.

కోక చుట్టి.. రక్ష కట్టి

తుళ్లూరు మండలం మందడం గ్రామ సమీపంలో మొక్కజొన్న పంటల చుట్టూ రైతులు చీరలు కట్టారు. పిచ్చుకలు, పశువుల బారి నుంచి రక్షణగా, పంటపై దుమ్ము వ్యాపించకుండా వీటిని కట్టినట్లు రైతులు చెబుతున్నారు. ఇలా చేయడం వల్ల దిగుబడిపైనా సానుకూల ప్రభావం ఉందని చెప్పారు. **- ఈనాడు గుంటూరు**



మురుగులోనే జీవనం

మురుగునీరు బయటకు పోయే దారి లేదు.. ఇంటి ముంగిట కాలు పెట్టలేని దుస్థితి.. ఇదీ తుళ్లూరు మండలం మల్కాపురంలో పరిస్థితి. ఇళ్ల మధ్యలో.. రహదారిని ఆనుకుని ఏళ్ల తరబడి పాచిపట్టిన మురుగు నీటి తటాకం రోగాలకు కారణమవుతోంది. ఇందులో చెత్తాచెదారం పేరుకుపోయాయి. దుర్వాసన వస్తోంది. ఈ నీటిని తోడేస్తేగానీ సమస్య పరిష్కారం కాదంటున్నారు స్థానికులు. **- ఈనాడు, అమరావతి**



మల్కాపురంలో ఇళ్ల మధ్యలో పాచి పట్టి ఇలా..



ఓ ఇంటి వద్ద అడుగు పెట్టలేని దుస్థితి

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి: బూర్ల

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: క్రీడల్లో చురుకుగా ఉంటే.. చదువుల్లో కూడా చురుకుగా ఉంటారని ప్రత్తిపాడు ఎమ్మెల్యే డాక్టరు బూర్ల రామాంజనేయులు అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్రత్తిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయిలో మూడు రోజుల పాటు జరగనున్న ఆటల పోటీలను మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అండర్-14, అండర్- 17 విభాగాల్లో బాల, బాలికలకు వేర్వేరుగా వాలీబాల్, బాడ్మింటన్ పోటీలను నిర్వహించి నియోజకవర్గ జట్టులను ఎంపిక చేశారు. కమిటీ ఛైర్మన్ అబ్దుల్ రవూఫ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, డిప్యూటీ డీఈవో వెంకటేశ్వరరావు, ఎంఈవోలు రమాదేవి, లీలారాణి, తెదేపా నియోజకవర్గ పరిశీలకురాలు వందనాదేవి, మండల అధ్యక్షుడు శివరామ ప్రసాద్, పీడీ డేవిడ్ రాజ్ కుమార్, పీఈటీలు పాల్గొన్నారు.

మేడికొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం తాడికొండ నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు ప్రారంభమయ్యాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, అండర్-17 విభాగంలో బాలబాలికల ఖోఖో - కబడ్డీ పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన మొత్తం 350 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలను గ్రామ తెదేపా అధ్యక్షుడు మర్రిపూడి రాంబాబు, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ అనిల్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఏసురత్నం, ఎస్కే అలీమ్, హెచ్ఎం నాగలక్ష్మి పీడీ పావులూరి శరత్ బాబు పాల్గొన్నారు.



ప్రత్తిపాడు: వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు, డిప్యూటీ డీఈవో తదితరులు

ఈమని(దుగ్గిరాల), న్యూస్‌టుడే: జిల్లా స్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ వాలీ బాల్ పోటీలకు ఈమని జిల్లా పరిషత్తు హైస్కూలుకు చెందిన పులివర్తి ద్యాని, పెనుమాక ప్రవీణ్ ఎంపికైనట్లు హెచ్ఎం అల్లం ఝాన్సీవాణి, పీడీ జమీర్ మంగళవారం తెలిపారు. వీరిని తల్లి దండ్రుల కమిటీ ఛైర్మన్ కంచర్ల రాంబాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆటో బోల్తా... అయిదుగురు కూలీలకు గాయాలు

మేడికొండూరు: రోడ్డు ప్రమాదంలో ఐదుగురు కూలీలు గాయపడ్డారు. వివరాల్లోకెళితే.. సిరిపురం నుంచి సిమెంట్ పని నిమిత్తం కూలీలు మంగళవారం ఉదయం ఆటోలో గుంటూరు బయలుదేరారు. ఈ క్రమంలో మేడికొండూరు శివారు వద్దకు రాగానే ఆటో టైరు పంక్చర్ కావడంతో అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో షరీఫ్, జానీబాషా, మస్తాన్‌వలి, ఇస్మాయిల్, నాసర్‌వలికి గాయాలయ్యాయి. వీరిలో ముగ్గురిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. మేడికొండూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

ఉల్లిపాయల లారీ పల్టీ

ఫిరంగిపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రమాద వశాత్తు అదుపుతప్పి ఉల్లిపాయల లారీ బోల్తా కొట్టింది. సేకరించిన వివరాల మేరకు.. కర్నూలు జిల్లా కోడమూరు నుంచి ఉల్లిపాయల లోడుతో పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం బయలుదేరింది. మంగళవారం తెల్లవారు జామున ఫిరంగిపురం పంచాయతీ కార్యాలయం వద్దకు వచ్చేసరికి ముందు వెళ్తున్న వాహనాన్ని తప్పించబోయి డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో అదుపు తప్పింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

డివైడర్‌ను ఢీకొట్టి.. పల్నాడు జిల్లా నరసరావుపేట నుంచి గుంటూరు వెళ్తున్న లారీ సోమవారం అర్ధరాత్రి ఫిరంగిపురం వద్ద డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

టైరు పంక్చర్..పైపులను ఢీ కొట్టిన కారు

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాజధాని సీడ్ యాక్సెస్ రహదారిపై మంగళవారం ప్రమాదం జరిగింది. స్థానికంగా ఒక యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న వ్యక్తి విజయవాడ వైపు నుంచి వస్తున్న క్రమంలో కారు టైరుకు పంక్చర్ అయ్యింది. దీంతో అదుపు తప్పిన వాహనం రోడ్డు వెంబడి ఉన్న పైపులను ఢీ కొట్టింది. కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతిన్నా అందులోని వ్యక్తులు క్షేమంగా బయటపడడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

కిలారిని కలిసిన జనసేన నాయకులు

వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే: ముట్లూరు నుంచి వెళ్లిన జనసేన నాయకులు గుంటూరులో మాజీ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్యను మంగళవారం కలిశారు. కిలారి జనసేనలో చేరుతున్నట్లు ప్రచారం నేపథ్యంలో ఈ పరిణామం స్థానికుల్లో చర్చనీయాంశంగా మారింది.

ఆత్మకూరులో 'స్వచ్ఛతే సేవ'

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా మంగళగిరి-తాడేపలి నగర పాలక సంస్థ పరిధిలోని ఆత్మకూరు, ఇప్పటం, వడ్డేరపాలెంలో నగరపాలక సంస్థ అధికారులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రధాన రహదారిలో చెత్తా, చెదారాలను తొలగించారు. దోమల నివారణ మందు, బ్లీచింగ్ జల్లారు. అక్టోబరు 2 వరకు ఈ కార్యక్రమాలు కొనసాగుతాయని కమిషనర్ అలీంబాషా తెలిపారు.

అసైన్డ్ భూమి దస్త్రాల పరిశీలన

పెదనందిపాడు, న్యూస్‌టుడే: పెదనందిపాడు తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మీ సందర్శించారు. అసైన్డ్ భూమికి సంబంధించి (2003కు ముందు) గత ప్రభుత్వం ఆ భూమి అమ్మకాలు, కొనుగోలు జరుపవచ్చని ఇచ్చిన ఉత్తర్వులు మేరకు అవి సక్రమంగా జరిగాయా లేదా అని దస్త్రాలను పరిశీలించారు. లబ్ధిదారులకు ఇచ్చిన పట్టాల ప్రకారం వారే ఉన్నారా లేదా అని ఆరా తీశారు. మండలంలోని గ్రామాలలో 68.38 ఎకరాలు 121 మంది లబ్ధిదారులకు పట్టాలిచ్చారని వీటిని సంబంధించి పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

పోలీసులకు కంటి వైద్య పరీక్షలు

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: మంగళగిరిలోని ఆరో బెటాలియన్‌లో అమరావతి ఐ ఆస్పత్రి, దుహిత మల్టీ స్పెషాలిటీ డెంటల్ కేంద్రం ఆధ్వర్యంలో పోలీసులకు వైద్య శిబిరం నిర్వహించారు. ఆరో బెటాలియన్ కమాండెంట్ నగేష్ బాబు వైద్య శిబిరాన్ని ప్రారంభించి ప్రసంగించారు. పోలీసులు 24 గంటలు విధుల్లో ఉండడం వల్ల ఆరోగ్య సమస్యలపై దృష్టి పెట్టలేకపోతున్నారని చెప్పారు. అదనపు కమాండెంట్ వెంకటేశ్వరరావు, సహాయ కమాండెంట్ వెంకట్, వైద్యులు నాదెళ్ల వేణు, శైలజా, గౌతమి తదితరులు పాల్గొన్నారు.

మహిళ మృతదేహం గుర్తింపు

ఎ.ఎన్.యు: కృష్ణానది సమీపంలోని వారధి వద్ద గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. మృతురాలికి సుమారు 50 ఏళ్లు ఉంటాయని సంవత్సరాలు ఉంటాయని చెప్పారు. ఆచూకీ తెలిసిన వాళ్లు తాడేపల్లి పోలీసులను సంప్రదించాలన్నారు.

'నెయ్యి కల్తీ అవ్వలేదని నిరూపించగలరా..?'

కాకుమాను, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ తయారీకి వినియోగించే నెయ్యిలో జంతువుల కొవ్వు కల్తీ జరగలేదని మాజీ ఏఏజీ పొన్నవోలు సుధాకర్ రెడ్డి నిరూపించగలరా...? అని సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కొల్లా వీరయ్య చౌదరి ప్రశ్నించారు. కాకుమానులో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. తిరుమల లడ్డూలో వినియోగించే నెయ్యి కంటే పంది కొవ్వు ఎక్కువ ధర పలుకుతుందని కించపరిచేలా మాట్లాడిన పొన్నవోలుపై చర్యలు తీసుకోవాలన్నారు.

ఎమ్మెల్యేపై దుష్ప్రచారం చేస్తున్నారని ఫిర్యాదు

తాడికొండ, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణను వ్యతిరేకించినట్లు తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్‌పై సామాజిక మాధ్యమాల్లో గ్రామానికి చెందిన గేరా నవీన్ కుమార్ తప్పుడు ప్రచారం చేస్తున్నాడని, అతడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక తెదేపా నాయకులు మంగళవారం తాడికొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వాసు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ఈదులపాలెం(ప్రత్తిపాడు), న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రత్తిపాడు ఎస్సై నాగేంద్ర తెలిపిన వివరాల మేరకు..బాపట్ల మండలం, ఉప్పరపాలేనికి చెందిన చీరాల వెంకటేశ్వరరెడ్డి (70) ప్రత్తిపాడు పరిధిలోని పొగాకు కంపెనీలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 22న సాయంత్రం కంపెనీకి నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలై గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు కుమార్తె ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

వరద బాధితులకు చేయూత

ఎ.ఎన్.యు: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వచ్చిన వరదలతో మంగళగిరిలో కొండచరియలు విరిగిపడి ఉపాధి కోల్పోయిన వారికి మంత్రి నారా లోకేశ్ సమకూర్చిన నిత్యావసర సరకులను తెదేపా నేతలు అందజేశారు. పట్టణంలోని గండాలయపేట, కొత్తపేట, ద్వారకానగర్‌లో ఉపాధి కోల్పోయిన 47 కుటుంబాలకు 15 రోజులకు సరిపోయేలా వస్తువులను పంపిణీ చేశారు. తెదేపా పట్టణ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, పార్టీ నేతలు వాకా మాధవరావు, జొన్నాదుల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమం, అభివృద్ధి దిశగా రాష్ట్రం పరుగులు



కరపత్రం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్

ఎన్టీఆర్ సర్కిల్, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబు పాలనలో సంక్షేమం, అభివృద్ధి దిశగా రాష్ట్రం పరుగులు తీస్తోందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ పేర్కొన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 11వ డివిజన్‌లో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. మెగా డీఎస్సీని ప్రకటించారని పేర్కొన్నారు. వరద బాధిత ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు తీసుకొచ్చేందుకు బాబు ఎంతో శ్రమించారని కొనియాడారు. తెదేపా నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ పలువురు తెదేపా నాయకులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య అధికారులపై కమిషనర్ ఆగ్రహం



పూడికతీత పనులు పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: ఇంజినీరింగ్, ప్రజారోగ్య విభాగం అధికారులు డివిజన్లలో స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని కమిషనర్ శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం సగర కాలనీ, రామిరెడ్డితోట, ఓల్డ్‌క్లబ్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించి పూడికతీత పనులు పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ.. సగర కాలనీలో వర్షం నీరు నిల్వ ఉండకుండా కాల్వల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రామిరెడ్డితోట మొదటిలైన్‌లో మురుగునీరు రహదారిపైకి చేరి ఉండటంతో ప్రజారోగ్య అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. వెంటనే పూడిక తీసి శుభ్రం చేయించారు. ఇంజినీరింగ్ అధికారులు పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది సమన్వయంతో డ్రెయిన్లపై ఉన్న ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారు. పర్యటనలో కార్పొరేటర్ శ్రీవల్లి, సీపీ రాంబాబు, ఈఈ సుందరరామిరెడ్డి, ఏడీహెచ్ రామారావు, ఏసీపీ అజయ్‌కుమార్, ఎంహెచ్‌వోలు రామారావు, ఆనంద్‌కుమార్, ఎస్ఎస్ ఆయూబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

వనరులు సమృద్ధి.. అభివృద్ధి ఏదీ..?



గతంలో వృత్తి శిక్షణ సాగిన భవనం

✤ నిరుపయోగంగా కార్మికశాఖ స్థలం

గత ప్రభుత్వ హయాంలో విక్రయించేందుకు యత్నం



వల్లూరివారితోటలో కార్మికశాఖకు చెందిన ఖాళీస్థలం

నగరపాలక సంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే

నగరం నడిబొడ్డున అరండల్‌పేట వెనకవైపు వల్లూరివారితోటలో కార్మికశాఖకు చెందిన భారీ స్థలం ఉంది. దీనిని ఏళ్ల కిందట కార్మికశాఖ వారు వెల్ఫేర్ సెంటర్‌గా వినియోగించుకున్నారు. అక్కడ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి శిక్షణ ఇచ్చేవారు. కాలక్రమేణా శిక్షణలు నిలిచిపోవడంతో ఆ స్థలం చిట్టడవిలా మారింది. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా తయారైంది. ఈ స్థలాన్ని బాగుచేసి అక్కడ పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరించాలని ఏళ్లుగా చెబుతున్నా నగరపాలకసంస్థ అధికారులు కేవలం జంగిల్ క్లియరెన్స్ చేసి వదిలేశారు.

13.58 ఎకరాల స్థలం నగరం మధ్యలో ఉండటంతో గజం విలువ రూ.60 వేలకు పైగా ఉంది. ఈ స్థలంలో గతంలో తెదేపా పాలనలో జీజీహెచ్ ఎక్స్‌టెన్షన్ కోసం అత్యవసర సర్వీసులు నిర్వహించేందుకు 6.58 ఎకరాలు ఇచ్చారు. వైకాపా ప్రభుత్వం ఈ ప్రతిపాదనను అటకెక్కించింది. మిగిలిన స్థలం ఏపీఐఐసీ కిందకు చేర్చారు. బిల్డ్ ఏపీలో భాగంగా ఆక్షన్ పెట్టి విక్రయించేందుకు పూనుకోగా అప్పుడు తెదేపా, జనసేన, భాజపా, ఇతర వామపక్షాలు ప్రతిఘటించడంతో ఆపారు.

పార్కు, వాకింగ్ ట్రాక్ కోసం పలుమార్లు ఆందోళనలు

సంక్షేమ కేంద్రం స్థలం మొత్తం చెత్త, వ్యర్థాలు పేరుకుపోయి ఉండటం, చిట్టడవిలా మారి స్థానికంగా పారిశుద్ధ్య సమస్యలతోపాటు ఆకతాయిలకు అడ్డాగా మారడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యపై సీపీఐ ఆధ్వర్యంలో పలుమార్లు ఆందోళనలు చేసినా జంగిల్ క్లియరెన్స్ చేయడం మినహా పార్కు, వాకింగ్‌ట్రాక్ ప్రతిపాదనలకు చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా జీఎంసీ స్థలం పోగా మిగిలిన స్థలంలో వాకింగ్ ట్రాక్ నిర్మాణం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

✤ కార్మికశాఖ స్థలం విషయమై ఈఈ కోటేశ్వరరావు 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. ఇక్కడ వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి ప్రతిపాదనలున్నాయి. స్థానికులు, ప్రజా ప్రతినిధులు ఈ విషయమై గతంలో సంప్రదించారు. స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణం చేయడంతో పాటు వాకింగ్‌ట్రాక్ ఏర్పాటుకు అధికారులతో మాట్లాడి టెండర్లను పిలుస్తామని తెలిపారు.

ఎన్టీఆర్ రైతు బజారులో ధరలు నిన్నటివి... (కిలో రూ.ల్లో) టమాట 35, వంగ 38, బెండ 35, పచ్చిమిర్చి 18, కాకర 38, క్యారెట్ 48, క్యాలీఫ్లవర్ 34, క్యాబేజీ 24, బీర 24, దొండ 39 బంగాళదుంప 39, ఉల్లిపాయలు 55, గోరుచిక్కుళ్లు 34, దోస 24, పొట్ల 30, మునగ 6, పెద్ద చిక్కుళ్లు 34, చామదుంప 38, మునగ 6,



గోంగూర 8, తోటకూర 10, కొత్తిమీర 50, బీట్‌రూట్ 32, కీర 34, క్యాప్సికం 64, అల్లం 95, ఫ్రెంచి బీన్స్ 55, సొర 10, అరటి 7

-న్యూస్‌టుడే, పట్నంబజారు

జాతీయ పురస్కారానికి ఎంపిక

తాడికొండ, న్యూస్‌టుడే: చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ నాదెండ్ల రామారావు జాతీయ ఉత్తమ ప్రిన్సిపల్ అవార్డుకు ఎంపికయ్యారని చలపతి విద్యా సంస్థల ఛైర్మన్ వైవీ ఆంజనేయులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫార్మా విద్యలో అత్యుత్తమ సేవలు అందించినందుకు 'అసోసియేషన్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ టీచర్స్ ఆఫ్ ఇండియా' ఈ అవార్డు అందజేస్తున్నట్లు తెలిపారు. ఫార్మా రంగంలో రామారావుకు 33 సంవత్సరాల అనుభవం ఉందని, 500పైగా పరిశోధనా పత్రాలు, 14 పుస్తకాలు, 4 పేటెంట్లు సొంతం చేసుకున్నారన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్‌కు కళాశాల అధ్యాపకులు, సెక్రటరీ సుజిత్ కుమార్ అభినందనలు తెలియజేశారు.

విద్యార్థులకు పోటీలు

నగరపాలకసంస్థ: స్వచ్ఛతా హీ సేవలో భాగంగా ఉన్నత పాఠశాలల విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలు నిర్వహిస్తున్నామని కమిషనర్ శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు స్వచ్ఛతా హీ సేవలో విద్యార్థులను భాగస్వాముల్ని చేస్తున్నట్లు తెలిపారు. కాలుష్య రహిత నగరం అంశంపై చిత్రలేఖనం, వ్యాసరచన, పర్యావరణ పరిరక్షణపై నినాదాలు ఉంటాయని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. పోటీలు ఈ నెల 26 ఉదయం 10.30 నుంచి బృందావన్‌గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతాయని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు నోడల్ అధికారి డి.తిరుపతిరెడ్డి ఫోన్ నెం.9493443342ను సంప్రదించాలని కోరారు.

డీఈఈల బదిలీ

నగరపాలకసంస్థ: ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న పలువురు డీఈఈలు బదిలీపై వెళ్లనున్నారు. డీఈఈలు రాము, రమేష్‌బాబులు మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థకు, రఫీక్(నరసరావుపేట), శ్రీధర్(ఏడీసీఎల్ విజయవాడ), శివకుమార్‌కు బాపట్ల బదిలీ అయింది. వీరి స్థానంలో జీఎంసీకి తెనాలి నుంచి నాగభూషణం, సత్తెనపల్లి నుంచి మధుసూదనరావు, పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ విభాగం నుంచి శ్రీనివాస్, కందుకూరు మున్సిపాలిటీ నుంచి రమేష్‌బాబు వస్తున్నారు.

ఏఈలు.. నగరపాలకసంస్థలో పనిచేస్తున్న ఏఈలు అనూష, పవన్‌కుమార్‌లు మంగళగిరి, తాడేపల్లి నగరపాలకసంస్థ, ఎస్ఎన్ఎంఎస్ బాబార్ చీరాల మున్సిపాలిటి, ఎం.ఎస్.నాగమల్లేశ్వరి బాపట్ల మున్సిపాలిటీకి, సునీల్‌కుమార్ తెనాలికి బదిలీపై వెళ్తున్నారు. గుంటూరుకు చీరాల నుంచి పి.శైలజ, ఆత్మకూరు నుంచి జె.ప్రసాద్ వస్తున్నారు.

కాపాలాదారుల గోడు ఆలకించండి

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: గాంధీపార్కులో పనిచేస్తున్న 14 మంది కాపాలాదారుల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఈ.మధుబాబు కోరారు. మంగళవారం యూనియన్ గౌరవాధ్యక్షులు, తెదేపా నాయకులు మద్దిరాల ఇమ్మానియేల్ (మ్యాని) ఆధ్వర్యంలో కమిషనర్‌ను ఆయన ఛాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. మధుబాబు మాట్లాడుతూ.. కాపాలాదారులను పొరుగుసేవల కింద గతేడాదిలో నియమించినట్లు తెలిపారు. సంబంధిత గుత్తేదారు ఏజెన్సీ వారికి రూ.14,337 ఒక్కొకరికి ఇవ్వాల్సి ఉండగా రూ.10 వేలు మాత్రమే చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు కూడా కల్పించడం లేదని తెలిపారు. కమిషనర్‌ను కలిసిన వారిలో ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మేడిద బాబురావు, మినిస్టీరియల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నమ్రత్‌కుమార్ తదితరులున్నారు.

ఎల్‌హెచ్ఎంఎస్ ఉపయోగించుకోండి: ఎస్పీ



ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: లాక్డు హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్ఎంఎస్) సౌకర్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సతీష్‌కుమార్ మంగళవారం తెలిపారు. దొంగతనాలు అరికట్టడానికి పోలీసుశాఖ ఎల్‌హెచ్ఎంఎస్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ఇళ్లకు తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లేవాళ్లు దొంగతనాలు జరగకుండా ఉండటానికి యాప్ అందిస్తున్న సేవలను ఉపయోగించుకోవాలని కోరారు.

మద్యం తాగి ఆటోలు నడపొద్దు



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న ట్రాఫిక్ డీఎస్పీ రమేష్

పట్నంబజారు, న్యూస్‌టుడే: మద్యం సేవించి ఆటోలు నడిపే డ్రైవర్లపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ డీఎస్పీ రమేష్ హెచ్చరించారు. రైతుబజారు సెంటర్‌లోని తూర్పు విభాగపు ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఆటో డ్రైవర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆటోలు డ్రైవర్లు విధిగా రికార్డులు కలిగి ఉండాలన్నారు. మహిళలు, వృద్ధుల పట్ల మర్యాద పాటించాలని సూచించారు. తూర్పు విభాగపు ట్రాఫిక్ సీఐ.అశోక్‌కుమార్ మాట్లాడుతూ బస్టాండు, రైల్వేస్టేషన్, పూల మార్కెట్ తదితర ముఖ్య కూడళ్లల్లో ఆటోలను రోడ్డుకు అడ్డంగా నిలుపవద్దని తెలిపారు. కార్యక్రమంలో వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్య, ట్రాఫిక్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రాన్ని అందిస్తున్న ఏపీ అంగన్‌వాడీ కార్మికులు, సహాయకుల సంఘం నాయకులు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ అంగన్‌వాడీ కార్మికులు, సహాయకుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు నేతాజీ, అధ్యక్షులు కుమారి మంగళవారం పీడీ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. అంగన్‌వాడీల్లో ఖాళీగా ఉన్న కార్మికుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, చిన్న కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా మార్చాలని, వంటపాత్రలు, గ్యాస్ పొయ్యిలు ఇవ్వాలని కోరారు. ఇప్పటికే పలుమార్లు వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ సమస్యలు పరిష్కరించడం లేదని, అక్టోబరు 15న పీడీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈలోగా సమస్యలు పరిష్కరించి అంగన్‌వాడీ కేంద్రాలలో మెరుగైన సేవలు అందించడానికి అధికారులు సహకరించాలని కోరారు. నాయకులు హేమలత, నిర్మలజ్యోతి, ఆదిలక్ష్మి, స్వర్ణలత పాల్గొన్నారు.

26న ఐలమ్మ విగ్రహావిష్కరణ

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు చిట్యాల ఐలమ్మ 129వ జయంతి సందర్భంగా ఈ నెల 26న గుంటూరు చంద్రమౌళినగర్‌లోని తపాల కార్యాలయం ఎదుట ఆమె విగ్రహావిష్కరణ చేస్తున్నట్లు ఏపీ రాష్ట్ర రజక జనసేన సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

చోరుడి అరెస్టు

పెనమలూరు, న్యూస్‌టుడే : పలు చోరీ కేసుల్లో నిందితుడిని స్థానిక పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వారి వివరాల ప్రకారం.. పోరంకిలోని ఓ ఎలక్ట్రికల్ దుకాణంలో ఈ నెల 18న దొంగతనం జరగ్గా దుకాణదారుడు రమేష్‌కుమార్ పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం చోరీ చేసింది కైకలూరు మండలం అటపాకకు చెందిన ఆరేపల్లి దుర్గారావుగా గుర్తించి, అరెస్టు చేశారు. అతడ్ని విచారించగా ఈ నెల 14న గుంటూరులోని ఓ జ్యువెలరీ దుకాణం, 15న గన్నవరంలోని రంగుల దుకాణం, మంగళగిరిలోని ఓ ఆటో మొబైల్ దుకాణం, 17న విజయవాడ ప్రభుత్వాసుపత్రి సమీపంలో, 18న గుంటూరు కొత్తపేటలోని ఎయిర్‌టెల్ దుకాణాల్లో చోరీ చేసినట్లు గుర్తించారు. నిందితుడి నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకొని న్యాయస్థానంలో హాజరు పరిచారు.

వృద్ధుడి ఆత్మహత్య

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఉరేసుకుని వృద్ధుడు మృతిచెందిన ఘటనపై మంగళవారం కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాసరావు (54) భార్య, పిల్లలు హైదరాబాద్‌లో ఉంటున్నారు. అతను గుంటూరులో కాపాలాదారుగా పనిచేస్తూ శీలంవారివీధిలో అద్దెకు ఉంటున్నాడు. ఒంటరిగా ఉంటున్న అతన్ని చూసేవాళ్లులేక మనస్తాపంతో మంగళవారం ఇంట్లో ఉరేసుకుని మృతి చెందారు. సోదరుడు రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వీరయ్య తెలిపారు.

దాడి చేసిన భర్తపై ఫిర్యాదు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: భర్త దాడిచేశాడంటూ భార్య నగరపాలెం పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమాన్‌నగర్‌కు చెందిన వెంకటరమణకు భర్త వెంకటేశ్వర్లుతో కొంతకాలంగా మనస్పర్థలున్నాయి. కొద్ది రోజుల క్రితం భర్త కొట్టాడంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి భర్త కేసును వెనక్కి తీసుకోవాలని బెదిరిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం వెంకటేశ్వర్లు తన ఇంటికి వచ్చి గడ్డపారతో తల పగలకొట్టాడని వెంకటరమణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మధుసూదనరావు తెలిపారు.

ఎన్నికల హామీల్ని తక్షణమే అమలు చేయాలి



మాట్లాడుతున్న తులసిరెడ్డి, చిత్రంలో విజయ్‌కుమార్, లింగంశెట్టి తదితరులు

పట్నంబజారు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు గడుస్తున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీల్ని అమలు చేయలేదని పీసీసీ మీడియా కమిటీ ఛైర్మన్, రాజ్యసభ మాజీ సభ్యులు తులసిరెడ్డి అన్నారు. రాజీవ్‌గాంధీభవన్‌లో మంగళవారం ఏర్పాటైన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ పథకాల్ని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. తిరుమల లడ్డు గురించి వైకాపా, తెదేపా, జనసేన పార్టీలు తిరుమల ప్రతిష్ఠను దెబ్బతీసే విధంగా మాట్లాడుతున్నాయన్నారు. జిల్లా అధ్యక్షుడు చిలకా విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. తిరుమల లడ్డు వ్యవహారంపై దేశవ్యాప్తంగా చర్చ జరిగే విధంగా తెలుగుదేశం, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీలో యువతకు ప్రాధాన్యత ఇచ్చి, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయిల్లో పదవుల్ని భర్తీ చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు, ఏపీసీసీ జనరల్ సెక్రటరీ గడ్డం పాల్ విజయ్‌కుమార్, కొమ్మినేని సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అద్భుత కావ్యం క్రీస్తు చరిత్ర

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: మహాకవి గుర్రం జాషువా రచనలన్నిటిలో క్రీస్తు చరిత్ర కావ్యం అద్భుతమైనదని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవర ప్రసాద్ అన్నారు. మంగళవారం గుంటూరు ఆంధ్ర క్రైస్తవ కళాశాలలో జేడీ శీలం సమావేశ మందిరంలో జాషువా కళాపీఠం ఆధ్వర్యంలో క్రీస్తు చరిత్ర కావ్యంపై సభ జరిగింది. దీనికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొమ్మాలపాటి మోజెస్ అధ్యక్షత వహించారు. డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ ఏ ఇతిహాసం, పురాణాన్నైనా పద్యంగా మలచవచ్చు కానీ బైబిల్‌ను పద్య ప్రక్రియలోకి తీసుకురావడం సులభం కాదనీ.. బైబిల్‌ను కూడా పద్యంలోకి తీసుకువచ్చిన ఘనత జాషువాకే దక్కుతుందన్నారు. ఆకావ్యంలో కేవలం బైబిల్ సంబంధ అంశాలే కాక ఆసియా ఖండం గొప్పతనం వివరంగా ఉందన్నారు. అందుకే కేంద్ర ప్రభుత్వం క్రీస్తు చరిత్ర కావ్యానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు ఇచ్చి సత్కరించిందన్నారు. సభలో ఆంధ్ర క్రైస్తవ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ టి.మాథ్యూ భాస్కర్ గుర్రం జాషువా స్మారక సమితి ఛైర్మన్ డాక్టర్ పెద్దీటి యోహాన్ ఏసీ కళాశాల విశ్రాంత అధ్యాపకుడు వై.శ్రీకాంత్, ఎంజేజేఎస్ కార్యదర్శి పరంగి సత్యరాజు, న్యాయవాది చందవోలు శోభారాణి, పాత్రికేయుడు నలకుర్తి విల్సన్, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కొణతం నాగేశ్వరరావు తదితరులు ప్రసంగించారు.

మురుగుతో సహవాసం



గుంటూరు శివారులోని రెడ్డిపాలెం ఎస్టీకాలనీలో ఇటీవల భారీ వర్షాలకు పలు ప్రాంతాలు నీట మునిగి ఇప్పటికి ముంపులో అల్లాడుతున్నాయి. చుట్టుపక్కల భవన సముదాయాల్లో ఉండే వారు మురుగు కాలువను పూర్తిగా పూడ్చి వేశారు. దీంతో రెడ్డిపాలెంలోని మురుగునీరు వెళ్లే దారి లేక ఇలా పదుల సంఖ్యలో జనావాసాలు మురుగులో మగ్గుతున్నాయి. దోమలు వ్యాపించి విషజ్వరాల పాలవుతున్నారు. ఇప్పటికే ఇద్దరు డెంగీ జ్వరాలతో మంచం పట్టారు. కార్పొరేషన్ సిబ్బంది ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.- **ఈనాడు గుంటూరు**

బాల్య వివాహాల నియంత్రణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న సీడీపీఓ కృష్ణవేణి

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: బాల్య వివాహాల నియంత్రణ అందరి బాధ్యతని గుంటూరు అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు, చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (సీడీపీఓ) తోట కృష్ణవేణి అన్నారు. మంగళవారం కొండా వెంకటప్పయ్య కాలనీలో చైల్డ్‌రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ (క్రాఫ్) ఆధ్వర్యంలో బాల్యవివాహాల నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ కృష్ణవేణి మాట్లాడుతూ.. వివాహం చేయాలంటే అమ్మాయికి 18, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండాలన్నారు. బాల్యవివాహాలు జరిగితే దంపతులకు పుట్టే పిల్లలు శారీరక, మానసిక లోపంతో ఉండే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గురవయ్య, ఏసీడీపీఓ చంద్రకళ, క్రాఫ్ సమన్వయకర్త వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: గుఱ్ఱం జాషువా జయంతి సందర్భంగా ఎస్ఎఫ్ఐ, జాషువా విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని పలు కళాశాలల్లో నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన పోటీలకు విశేష స్పందన వచ్చింది. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ నెల 26న అతిథుల చేతుల మీదుగా బహుమతుల ప్రదానం జరుగుతుందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం. కిరణ్ తెలిపారు. జిల్లా అధ్యక్షులు షేక్ సమీర్, సహాయ కార్యదర్శి యశ్వంత్, పవన్ పాల్గొన్నారు.

నేడు యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ రజతోత్సవాలు

పట్నంబజారు, న్యూస్‌టుడే: గోరంట్లలోని హోసన్నా ప్రాంగణంలో బుధవారం సాయంత్రం 6 గంటలకు యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ రజతోత్సవాలు నిర్వహించనున్నట్లు యుపీఎఫ్ ప్రెసిడెంట్ కర్రా జోసఫ్ ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షుడు అబ్రహం, వైస్ ప్రెసిడెంట్ బి.జోసఫ్, సెక్రటరీ కె.జాన్సన్, ట్రెజరర్ కె.లూకా ఏసుక్రీస్తు బోధనల గురించి వివరిస్తారని పేర్కొన్నారు.

చంద్రన్న బీమా పునరుద్ధరించండి

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలో భవన నిర్మాణ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఇసుకను సమృద్ధిగా అందుబాటులోకి తీసుకురావాలని, కార్మికులకు చంద్రన్న బీమా పునరుద్ధరించి అందరికి వర్తించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు సత్యనారాయణ, ఖాసింవలి పాల్గొన్నారు.

26న వినియోగదారుల సదస్సు

గుంటూరు విద్యుత్తు, న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఈనెల 26న సదస్సు నిర్వహిస్తున్నట్లు టౌన్-1 కార్యనిర్వాహక ఇంజినీరు శ్రీనివాసబాబు తెలిపారు. విద్యుత్తు భవన్‌లోని సమావేశ మందిరంలో గురువారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగే ఈ సదస్సుకు గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలతో పాటు గుంటూరు రూరల్, పెదకాకాని మండలాల పరిధిలోని వినియోగదారులు ఈ సదస్సుకు హాజరై తమ సమస్యలను తెలియజేయవచ్చని తెలిపారు. సీజీఆర్ఎఫ్ ఛైర్మన్ విక్టర్ ఇమ్మానుయేల్ అధ్యక్షతన కమిటీ సభ్యులు వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదులను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు వినియోగించుకోవాల్సిందిగా సూచించారు.

శిరస్త్రాణం ధరిస్తేనే కార్యాలయంలోకి అనుమతి

ఎస్పీ కీలక నిర్ణయం



శిరస్త్రాణం లేకుంటే లోపలికి అనుమతించని సిబ్బంది



ధరిస్తే ఇలా..

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందిన వారిలో ఎక్కువ మంది తలకు బలమైన గాయాలైన వారే ఉన్నారు. పలు సందర్భాల్లో పోలీసులు సైతం రోడ్డు ప్రమాదాలలో తలకు దెబ్బతగిలి ప్రాణాలు విడిచిన ఘటనలూ ఉన్నాయి. శిరస్త్రాణం ధరించడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగిన ప్రాణాపాయం నుంచి బయటపడిన సందర్భాలు ఉన్నాయి. దీంతో ద్విచక్రవాహన చోదకులు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలని పోలీసులు తెలియజేస్తున్నారు. సభలు, సమావేశాలు, అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహిస్తున్నారు. నగరంలోని ప్రధాన కూడళ్లలో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. కేసులు నమోదు చేసి అపరాధ రుసుం విధిస్తున్నారు. అయినప్పటికి వాహన చోదకులు చెవికెక్కించుకోవడం లేదు.

★ పోలీసులు శిరస్త్రాణం ధరించకుండా ద్విచక్రవాహనాలపై ప్రయాణించడాన్ని ఎస్పీ సతీష్‌కుమార్ అనేక ప్రాంతాల్లో స్వయంగా చూశారు. ఈ నేపథ్యంలో ద్విచక్రవాహనంపై పోలీసు కార్యాలయం లోపలకి వచ్చే ఆహ్వానితులు, అర్జీదారులు, పోలీసులూ శిరస్త్రాణం ధరించాలనే నిబంధన పెట్టారు. అందుకోసం పోలీసు కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించారు. శిరస్త్రాణం ధరించిన వారిని మాత్రమే లోపలకి అనుమతిస్తున్నారు. ధరించనివారి ద్విచక్రవాహనాలను బయటే నిలిపేస్తున్నారు. కొత్త నిబంధనపై ఆ శాఖ సిబ్బంది కొంత అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

రహదారికి మరమ్మతులు



నాడు



నేడు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: కొత్తపేట కుగ్లర్ ఆసుపత్రి ఎదుట రహదారి పగిలిపోయి ప్రమాదకరంగా ఉందని ఈ నెల 23న 'ఈనాడు'లో 'రహదారి ఇలా.. రాకపోకలు ఎలా?' శీర్షికతో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు రహదారికి మరమ్మతులు చేయించారు.

ఈనాడు కథనానికి స్పందన

లడ్డూ ప్రసాదం కల్తీపై సీబీఐ విచారణ జరగాలి

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: వైకపా హయాంలో తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ చేసిన వాళ్లను, చేయించిన వాళ్లను కఠినంగా శిక్షించాలని స్థానిక డొంక రోడ్డు యూత్, వెంగమాంబ సేవా సమితి నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ర్యాలీ నిర్వహించారు. మంగళవారం స్థానిక డొంక రోడ్డు కాకుమానువారితోట నాలుగో లైను నుంచి డొంకరోడ్డులోని వేంకటేశ్వర స్వామి దేవాలయం వరకు మహిళలు వృద్ధులు, యువకులు డొంకరోడ్డు యూత్, వేంగమాంబ సేవా సమితి ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. దేవాలయం ముందు వంద కొబ్బరికాయలు కొట్టి గోవిందా.. గోవిందా అంటూ నినాదాలు చేశారు.

గుంటూరు పశ్చిమ

చంద్రబాబు పాలనలో అన్ని వర్గాలకు భరోసా


స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: చంద్రబాబు పాలన అన్ని వర్గాలకు భరోసా కల్పిస్తూ ముందుకు సాగుతోందని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి పేర్కొన్నారు. మంగళవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా స్తంభాలగరువు, గ్యాంగ్ కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ సంక్షోభంలోనూ సంక్షేమం అందించే సత్తా ఒక్క చంద్రబాబుకే ఉందన్నారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ అన్ని వర్గాల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. 206 వార్డు సచివాలయాల కార్యదర్శులు పూర్తి స్థాయిలో పాల్గొనేలా పర్యవేక్షణలకు 41 మంది నోడల్ అధికారులను నియమించామన్నారు.

పట్టాభిపురం, న్యూస్‌టుడే: ప్రజలు మెచ్చే విధంగా చంద్రబాబు పాలన కొనసాగిస్తున్నారని తెదేపా రాష్ట్ర నూర్‌బాషా సాధికార కన్వీనర్ షేక్ సుభాన్ సాహెబ్ పేర్కొన్నారు. తెదేపా జిల్లా కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత అయిదేళ్లల్లో కుంటుపడిన మైనార్టీ సంక్షేమ కార్యక్రమాలపై చంద్రబాబు సమీక్ష నిర్వహించి హజ్ యాత్రకు వెళ్లే వారికి రూ.లక్ష, ప్రతి మసీదు నిర్వహణకు నెలకు రూ.5000, మౌజన్లకు రూ.5000, ఇమామ్‌లకు రూ.10000 ఇస్తామని ప్రకటించడం హర్షణీయమన్నారు.

గోరంట్ల: నూరుబాషా కార్పొరేషన్‌ను రూ.వంద కోట్లతో ఏర్పాటు చేసేందుకు సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకోవడం హర్షించదగిన విషయమని నూరుబాషా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.పీర్.మహమ్మద్ అన్నారు. మంగళవారం గోరంట్లలోని కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కె.పీర్.మహమ్మద్ మాట్లాడుతూ నామినేటెడ్ పదవుల్లోనూ దామాషా ప్రకారం ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

లడ్డూ ప్రసాదం కల్తీపై సీబీఐ విచారణ జరగాలి


గుంటూరు కాకుమానువారితోటలో ప్రదర్శన

గుంటూరు సాంస్కృతికం: తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ చేసిన, చేయించిన వారిని కఠినంగా శిక్షించాలని స్థానిక డొంక రోడ్డు యూత్, వెంగమాంబ సేవా సమితి నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ర్యాలీ నిర్వహించారు. మంగళవారం స్థానిక డొంక రోడ్డు కాకుమానువారితోట నాలుగో లైను నుంచి డొంకరోడ్డులోని వేంకటేశ్వర స్వామి దేవాలయం వరకు మహిళలు వృద్ధులు, యువకులు డొంకరోడ్డు యూత్, వేంగమాంబ సేవా సమితి ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు.

‘మతసామరస్యం కాపాడటంలో జగన్ విఫలం’

పట్టాభిపురం, న్యూస్‌టుడే: జగన్‌కు క్రైస్తవులు, హిందువులపై ఏమాత్రం గౌరవం, విశ్వాసం లేవని రాష్ట్ర క్రిస్టియన్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ మద్దిరాల మ్యాని విమర్శించారు. మంగళవారం తెదేపా జిల్లా కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మతసామరస్యాన్ని కాపాడడంలో జగన్ పూర్తిగా విఫలమయ్యారు. తిరుమల శ్రీవారి లడ్డూకు కల్తీ నెయ్యి వినియోగించి భక్తుల మనోభావాలను దెబ్బ తీశారని విమర్శించారు. క్రైస్తవుడని చెప్పుకొని వారి ఓట్లతో గద్దెక్కిన జగన్ ప్రత్యేకంగా వారికి ఒరగబెటిందేమీ లేదని అన్నారు. అంతకుముందు చంద్రబాబు హయాంలో క్రిస్టియన్ భవన్ నిర్మాణానికి రెండు ఎకరాలు కేటాయించి రూ.16 కోట్ల నిధులు విడుదల చేసి నిర్మాణం చేపట్టి 90 శాతం పనులు పూర్తి చేస్తే.. మిగిలిన 10 శాతం పనులను చేయకుండా జగన్ అర్ధంతరంగా నిలిపివేశారన్నారు. తెదేపా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చంద్రబాబు తాము అడగక పోయినా క్రిస్టియన్ భవన్ నిర్మాణం కోసం రూ.10 కోట్లు కేటాయించి పనులు ప్రారంభించాలని ఆదేశించడం సంతోషంగా ఉందని మ్యాని పేర్కొన్నారు. గతంలో గుంటూరు నగరంలో క్రైస్తవుల సమాధుల కోసం రూ.17 కోట్ల స్థలాన్ని కేటాయించి చంద్రబాబు కంచె వేయిస్తే.. జగన్ అధికారంలోకి వచ్చాక తాడిచెట్టు లోతున మట్టి తవ్వి క్రైస్తవుల మనోభావాలను దెబ్బ తీశారని విమర్శించారు. తెదేపా నాయకులు వెంకట్రావు, అనిల్‌కుమార్, రామారావు పాల్గొన్నారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్ ఉపయోగించుకోండి

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్) సౌకర్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సతీష్‌కుమార్ మంగళవారం తెలిపారు. దొంగతనాలు అరికట్టడానికి పోలీసుశాఖ ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ఇళ్లకు తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లేవాళ్లు దొంగతనాలు జరగకుండా ఉండటానికి యాప్ అందిస్తున్న సేవలను ఉపయోగించుకోవాలని కోరారు.

26న వినియోగదారుల సదస్సు

గుంటూరు విద్యుత్తు, న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఈనెల 26న సదస్సు నిర్వహిస్తున్నట్లు టౌన్‌-1 కార్యనిర్వాహక ఇంజినీర్ శ్రీనివాసబాబు తెలిపారు. విద్యుత్తు భవన్‌లోని సమావేశ మందిరంలో గురువారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగే ఈ సదస్సుకు గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలతో పాటు గుంటూరు రూరల్, పెదకాకాని మండలాల పరిధిలోని వినియోగదారులు ఈ సదస్సుకు హాజరై తమ సమస్యలను తెలియజేయవచ్చని తెలిపారు.

రాకపోకలకు అవస్థలే..!

రోడ్లపైనే వాహనాల నిలిపివేత

పట్టించుకోని ట్రాఫిక్, నగరపాలక సంస్థ అధికార యంత్రాంగం


నారాయణ పాఠశాల వద్ద రహదారిని ఆక్రమించేసి ట్రావెల్స్ బస్సులు ఇలా...

పట్టాభిపురం, న్యూస్‌టుడే

నగరంలో ప్రధాన రహదారులు పార్కింగ్ స్టాండ్లను తలపిస్తున్నాయి. ఎవరికి వారు నిబంధనలను అతిక్రమించి పార్కింగ్ వసతుల్లేకుండా స్థలం హద్దు వరకు భవనాలు నిర్మిస్తున్నారు. ఆ భవనాల్లో వ్యాపారాలు ఏర్పాటు చేశాక వాహనచోదకులు రహదారులపైకి వాహనాలను నిలపడం సర్వసాధారణమైపోయింది. చర్యలు తీసుకోవాల్సిన ట్రాఫిక్ పోలీసులు, నగరపాలక సంస్థ అధికార యంత్రాంగం మామూళ్ల మత్తులో జోగుతుండడంతో ఆక్రమణదారుల ఆడిందే ఆట.. పాడిందే పాటగా తయారైంది. ఫలితంగా రద్దీ సమయాల్లో వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ సమస్యలు తలెత్తి ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.


బి.ఆర్ గార్డెన్స్ రహదారిలో ఎన్టీఆర్ స్టేడియం వద్ద రోడ్డును ఆక్రమించేసి ఇలా..


పట్టాభిపురం ప్రధాన రహదారిలో స్వామి వివేకానందుడి విగ్రహం జిమ్ వద్ద పార్కింగ్ స్టాండ్‌ను తలపిస్తూ..

సామాజిక స్పృహ ఏదీ?

కొందరు స్వార్థపూరితంగా వ్యవహరించడం వల్ల ప్రజలకు ట్రాఫిక్ వెతలు తప్పడం లేదు. ట్రావెల్స్, వ్యాయామశాలలు, వస్త్ర దుకాణాలు, హోటళ్ల నిర్వాహకులకు భవనాల సెల్లార్‌లలో వాహనాల పార్కింగ్ ఉండడం లేదు. వివిధ పనుల నిమిత్తం వచ్చేవారు రోడ్లపైనే వాహనాలను నిలిపివేస్తున్నారు. ప్రజలు ఇబ్బందులు పడతారనే సామాజిక స్పృహ లేకుండా కార్లు కూడా రోడ్లపైనే నిలిపి సెల్‌ఫోన్లలో మాట్లాడుతున్నారు. అదేమని ప్రశ్నిస్తే గొడవలకు దిగుతున్నారని వాహనచోదకులు వాపోతున్నారు.

ఎక్కడెక్కడంటే..

★ వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుందని పట్టాభిపురం డీఆర్‌ఎం కార్యాలయం ఎదుట కార్పొరేషన్ స్థలంలో ఉండే రైతుబజార్ తొలగించి రోడ్డును విస్తరించి అభివృద్ధి చేశారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో సగం రహదారి ట్రావెల్స్ యజమాని ఒకరు బస్సులు, కార్లు నిలుపుతున్నారు. దీంతో వాహనచోదకులు, పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికుల నుంచి ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లడంతో సిబ్బంది రెండు, మూడు రోజులు హడావుడి చేసి తర్వాత మిన్నకుండిపోతున్నారు.

★ పట్టాభిపురం ప్రధాన రహదారిలో స్వామి వివేకానంద విగ్రహం వద్ద పాత రవాణా శాఖ కార్యాలయం భవనంలో ఏర్పాటు చేసిన వ్యాయామశాల నిర్వాహకులు వాహనాలు, కార్లను రోడ్డుపైనే నిలుపుతున్నారు. రోడ్డు మలుపు తిరిగే ప్రాంతంలో కార్లు పెట్టేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇదే రహదారిలో మెస్‌లు, టీ సెంటర్ల వద్ద అదే పరిస్థితి ఉన్నా పోలీసులు చోద్యం చూస్తున్నారు.


పట్టాభిపురం రహదారిలో ఓ మెస్ వద్ద రోడ్డు మీదకు వాహనాలు

★ బృందావన్ గార్డెన్స్ ప్రధాన రహదారిలో అయ్యప్పస్వామి దేవాలయం వద్ద నుంచి లక్ష్మీపురం యూనియన్ బ్యాంక్ సెంటర్ వరకు వాహనాల పార్కింగ్ రోడ్డు పైనే. ఈ మార్గంలో ఇటీవల కాలంలో షాపింగ్‌మాల్స్, హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు విపరీతంగా వచ్చాయి. పార్కింగ్ సౌకర్యం ఉన్నవి తక్కువే. ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ దారిలో ట్రాఫిక్ సమస్యలు జఠిలమవుతున్నాయి. ఎన్టీఆర్ స్టేడియం, వరలక్ష్మి టిఫిన్ సెంటర్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, మలుపుల వద్ద ట్రాఫిక్ రద్దీగా ఉంటుంది.

ఏం చేయాలంటే..

రోడ్లను ఆక్రమించేసి వాహనాలు నిలుపుతున్న వారిని గుర్తించి ముందుగా నోటీసులు ఇవ్వాలి. అవిధంగా పార్కింగ్ చేస్తే కేసులు నమోదు చేస్తామని రవాణా శాఖ దృష్టికి తీసుకెళ్లి పర్మిట్లు రద్దు చేయిస్తామని సూచించాలి. ట్రాఫిక్ పోలీసులు ఎప్పటికప్పుడు పెట్రోలింగ్ చేస్తూ రోడ్లపైకి వాహనాలను నిలిపేవారికి కౌన్సెలింగ్ నిర్వహించాలి. నగరపాలక సంస్థ అధికారులు ఆక్రమణల నిర్మూలన దళంతో వారంలో రెండు, మూడు సార్లు పర్యవేక్షిస్తూ ఉండాలి.

హిమటో ఆంకాలజీ గుంటూరుకు కేటాయించాలి

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: జన్యు సంబంధిత వ్యాధుల్ని గుర్తించి చికిత్స అందించేందుకు హిమటో ఆంకాలజీ విభాగాన్ని గుంటూరు జీజీహెచ్‌కు అనుబంధంగా ఏర్పాటు చేసేందుకు సాయం చేయాలని సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. హిమోఫిలియా బాధితులకు నూతనంగా అందుబాటులోకి వచ్చిన ఎమిసిజుమాబ్ సూది మందును మంగళవారం చిన్నపిల్లల విభాగం సమావేశం మందిరంలో ప్రారంభించిన అనంతరం కిరణ్‌కుమార్ మాట్లాడుతూ తొలిసారి జీజీహెచ్‌లో ఈ మందు అందుబాటులోకి తెచ్చామన్నారు. హిమోఫిలియా సొసైటీ సహకారం అందిస్తే రూ.50 కోట్ల వ్యయంతో హిమటో ఆంకాలజీ విభాగాన్ని ప్రారంభించవచ్చన్నారు. అవసరమైతే ఇందుకోసం బొంగరాలబీడులోని జీజీహెచ్ స్థలాన్ని కేటాయించాల్సిందిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తామన్నారు. రాష్ట్రంలో ఈ విభాగం ఎక్కడ అందుబాటులో లేనందున రోగులకు ఇబ్బందిగా ఉందన్నారు. వివిధ విభాగాల అధిపతులు శైలజ, దేవకుమార్, అరుణకుమారి, హిమోఫిలియా సొసైటీ కార్యదర్శి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

గోరంట్ల, న్యూస్‌టుడే: గోరంట్లలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో మంగళవారం ఎన్‌ఎస్‌ఎస్ ఎన్‌సీసీ, రెడ్ రిబ్బన్ కమిటీలు సంయుక్తంగా రక్తదానం శిబిరం నిర్వహించాయి. సెయింట్ ఆన్స్ కళాశాల ప్రిన్సిపల్ రెవరెండ్ సిస్టర్ సంధ్య, వైస్ ప్రిన్సిపల్ ఆర్.షారూన్‌రోజ్, ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ, రెడ్‌రిబ్బన్ కమిటీ నిర్వాహకులు ఐ.ఆదిలక్ష్మి, బాలశౌరెడ్డి, సుస్మిత, రెడ్‌క్రాస్ సొసైటీ బృంద సభ్యులు షేక్ జానీరసూల్, ఎస్.కృష్ణప్రసాద్, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ పురస్కారానికి ఎంపిక

తాడికొండ, న్యూస్‌టుడే: చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ నాదెండ్ల రామారావు జాతీయ ఉత్తమ ప్రిన్సిపల్ అవార్డుకు ఎంపికయ్యారని చలపతి విద్యా సంస్థల ఛైర్మన్ వైవీ ఆంజనేయులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫార్మా విద్యలో అత్యుత్తమ సేవలు అందించినందుకు ‘అసోసియేషన్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ టీచర్స్ ఆఫ్ ఇండియా’ ఈ అవార్డు అందజేస్తున్నట్లు తెలిపారు. ఫార్మా రంగంలో రామారావుకు 33 సంవత్సరాల అనుభవం ఉందని, 500పైగా పరిశోధనా పత్రాలు, 14 పుస్తకాలు, 4 పేటెంట్లు సొంతం చేసుకున్నారన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్‌కు కళాశాల అధ్యాపకులు, సెక్రటరీ సుజిత్ కుమార్ అభినందనలు తెలియజేశారు.

సీనియర్ అసిస్టెంట్ ఉమర్ సస్పెన్షన్ ఎత్తివేత

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: తాలుకా కార్యాలయంలోని ఉప ఖజానా కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ ఉమర్‌ను ఇటీవల జిల్లా ఖజానా శాఖ అధికారి రాజగోపాల్ సస్పెండ్ చేశారు. తనిఖీ సమయంలో వీడియో తీస్తున్న నేపథ్యంలో ఆయన్ను సస్పెండ్ చేశారు. అయితే తాజాగా ఉమర్‌పై సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ ఉత్తర్వులు వచ్చాయి.

క్యాన్సర్‌పై పోస్టర్‌కు ద్వితీయ స్థానం


సాంఘవికి సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రిన్సిపల్ టీటీకే రెడ్డి

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: అరుదైన క్యాన్సర్ వ్యాధి గురించి వివరిస్తూ సర్వజనాసుపత్రి జనరల్ మెడిసిన్ విద్యార్థి వైద్యురాలు సాంఘవి రూపొందించిన పోస్టరుకు రాష్ట్ర స్థాయి పోటీల్లో రెండో స్థానం దక్కింది. అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ 52వ రాష్ట్ర వార్షిక సదస్సు ఈ నెల ఈ నెల 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగింది. ఇందులో సాంఘవి తయారు చేసిన పోస్టరును న్యాయనిర్ణేతలు పరిశీలించి ఈ బహుమతి ప్రకటించారు. సాంఘవిని గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపల్ టీటీకే రెడ్డి మంగళవారం కళాశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో సాంఘవిని అభినందించి సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారు.

* పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన ఓ విద్యార్థి(21) ఎంబీఏ చదువుతుండగా మలంతోపాటు రక్తం పడడం, తిండి, బరువు తగ్గడం వంటి సమస్యలతో ఇటీవల సర్వజనాసుపత్రికి వచ్చాడు. వైద్యులు పరీక్షించగా పెద్ద పేగుల చివరన ఉండే పురీషనాళం(రెక్టమ్)లో లింఫోమ వ్యాధిగా గుర్తించారు. ఇది చాలా అరుదైన క్యాన్సర్. సాధారణంగా రెక్టమ్ క్యాన్సర్‌కు శస్త్రచికిత్స, రేడియోథెరపీ వంటి చికిత్సలు అవసరమవుతాయి. నాట్కో క్యాన్సర్ కేంద్రం మెడికల్ ఆంకాలజీ విభాగంలో ఆ విద్యార్థిని చేర్చుకుని చికిత్స ప్రారంభించారు. కేవలం కీమోథెరపీ చికిత్సతో వ్యాధి పూర్తిగా నయమయ్యింది. లింఫోమ సాధారణంగా లింఫ్ గ్రంథుల్లో వస్తుంది. రెక్టమ్‌లో రావడం అత్యంత అరుదుగా చూస్తుంటామని ఆ విభాగం అధిపతి శివరామకృష్ణ తెలిపారు.

శిరస్త్రాణం ధరిస్తేనే కార్యాలయంలోకి అనుమతి

గుంటూరు నేరవార్తలు: రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందిన వారిలో ఎక్కువ మంది తలకు బలమైన గాయాలైన వారే ఉన్నారు. పలు సందర్భాల్లో పోలీసులు సైతం రోడ్డు ప్రమాదాలలో తలకు దెబ్బతగిలి ప్రాణాలు విడిచిన ఘటనలూ ఉన్నాయి. శిరస్త్రాణం ధరించడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగిన ప్రాణాపాయం నుంచి బయటపడిన సందర్భాలు ఉన్నాయి. దీంతో ద్విచక్రవాహన చోదకులు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలని పోలీసులు తెలియజేస్తున్నారు. సభలు, సమావేశాలు, అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహిస్తున్నారు. నగరంలోని ప్రధాన కూడళ్లలో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. కేసులు నమోదు చేసి అపరాధ రుసుం విధిస్తున్నారు. అయినప్పటికి వాహన చోదకులు చెవికెక్కించుకోవడం లేదు.

★ పోలీసులు శిరస్త్రాణం ధరించకుండా ద్విచక్రవాహనాలపై ప్రయాణించడాన్ని ఎస్పీ సతీష్‌కుమార్ అనేక ప్రాంతాల్లో స్వయంగా చూశారు. ఈ నేపథ్యంలో ద్విచక్ర వాహనంపై పోలీసు కార్యాలయం లోపలకి వచ్చే ఆహ్వానితులు, అర్జీదారులు, పోలీసులూ శిరస్త్రాణం ధరించాలనే నిబంధన పెట్టారు. అందుకోసం పోలీసు కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించారు. శిరస్త్రాణం ధరించిన వారిని మాత్రమే లోపలకి అనుమతిస్తున్నారు. ధరించనివారి ద్విచక్రవాహనాలను బయటే నిలిపేస్తున్నారు. కొత్త నిబంధనపై ఆ శాఖ సిబ్బంది కొంత అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.


శిరస్త్రాణం లేకుంటే లోపలికి అనుమతించమని చెబుతున్న సిబ్బంది


ధరించిన వారిని మాత్రమే అనుమతించారు

డీఈఈల బదిలీ

నగరపాలకసంస్థ: ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న పలువురు డీఈఈలు బదిలీపై వెళ్లనున్నారు. డీఈఈలు రాము, రమేష్‌బాబులు మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థకు, రఫీక్(నరసరావుపేట), శ్రీధర్(ఏడీసీఎల్ విజయవాడ), శివకుమార్‌కు బాపట్ల బదిలీ అయింది. వీరి స్థానంలో జీఎంసీకి తెనాలి నుంచి నాగభూషణం, సత్తెనపల్లి నుంచి మధుసూదనరావు, పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ విభాగం నుంచి శ్రీనివాస్, కందుకూరు మున్సిపాలిటీ నుంచి రమేష్‌బాబు వస్తున్నారు.

★ **ఏఈలు..** నగరపాలకసంస్థలో పనిచేస్తున్న ఏఈలు అనూష, పవన్‌కుమార్‌లు మంగళగిరి, తాడేపల్లి నగరపాలకసంస్థ, ఎస్‌ఎన్‌ఎంఎస్ బాబార్ చీరాల మున్సిపాలిటీ, ఎం.ఎస్.నాగమల్లేశ్వరి బాపట్ల మున్సిపాలిటీకి, సునీల్‌కుమార్ తెనాలికి బదిలీపై వెళ్తున్నారు. గుంటూరుకు చీరాల నుంచి పి.శైలజ, ఆత్మకూరు నుంచి జె.ప్రసాద్ వస్తున్నారు.

ఎమ్మెల్యేపై దుష్ప్రచారం చేస్తున్నారని ఫిర్యాదు

తాడికొండ, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణను వ్యతిరేకించినట్లు తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్‌పై సామాజిక మాధ్యమాల్లో గ్రామానికి చెందిన గేరా నవీన్ కుమార్ తప్పుడు ప్రచారం చేస్తున్నాడని, అతడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక తెదేపా నాయకులు మంగళవారం తాడికొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వాసు తెలిపారు.

కొనసాగుతున్న నిరసన

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: ఒప్పంద విధానంలో పనిచేస్తున్న స్టాఫ్ నర్సులను క్రమబద్ధీకరించాలనే డిమాండ్‌తో గత 20 రోజుల నుంచి చేపట్టిన నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తూనే ఉన్నాయి. ఏపీ నర్సెస్ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం జీజీహెచ్ ఎదుట నిరసన చేపట్టారు. ఆ సంఘం నాయకులు మనీష, రేణుక, శివమ్మ, సౌజన్య, కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో ప్రతిభ

గుంటూరు వైద్యం: ఆసోషియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ 52వ రాష్ట్ర వార్షిక సదస్సులో నిర్వహించిన క్విజ్ పోటీల్లో గుంటూరు వైద్య కళాశాల విద్యార్థి వైద్యులు రచన, పూజితల బృందానికి తృతీయ స్థానం దక్కింది. విశాఖ ఈనెల 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు జరిగిన ఈ సదస్సులో ఏర్పాటు చేసిన క్విజ్ పోటీల్లో రాష్ట్రంలోని పలు వైద్య కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థి వైద్యులు పోటీ పడినప్పటికీ జీఎంసీ జట్టుకు మూడో స్థానం దక్కడం గమనార్హం. గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపల్ టీటీకే రెడ్డి మంగళవారం కళాశాలలో విజేతలను అభినందించి ధ్రువపత్రాలు ప్రదానం చేశారు.

అద్భుత కావ్యం క్రీస్తు చరిత్ర

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: మహాకవి గుర్రం జాషువా రచనలన్నిటిలో క్రీస్తు చరిత్ర కావ్యం అద్భుతమైనదని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవర ప్రసాద్ అన్నారు. మంగళవారం గుంటూరు ఆంధ్ర క్రైస్తవ కళాశాలలో జేడీ శీలం సమావేశ మందిరంలో జాషువా కళాపీఠం ఆధ్వర్యంలో క్రీస్తు చరిత్ర కావ్యంపై సభ జరిగింది. దీనికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొమ్మలపాటి మోజెస్ అధ్యక్షత వహించారు. డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ ఏ ఇతిహాసం, పురాణాన్నైనా పద్యంగా మలచవచ్చు కానీ బైబిల్‌ను పద్య ప్రక్రియలోకి తీసుకురావడం సులభం కాదనీ.. బైబిల్‌ను కూడా పద్యంలోకి తీసుకువచ్చిన ఘనత జాషువాకే దక్కుతుందన్నారు. ఆకావ్యంలో కేవలం బైబిల్ సంబంధ అంశాలే కాక ఆసియా ఖండం గొప్పతనం వివరంగా ఉందన్నారు. అందుకే కేంద్ర ప్రభుత్వం క్రీస్తు చరిత్ర కావ్యానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు ఇచ్చి సత్కరించిందన్నారు. సభలో ఆంధ్ర క్రైస్తవ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ టి.మాధ్యూ భాస్కర్ గుర్రం జాషువా స్మారక సమితి ఛైర్మన్ డాక్టర్ పెద్దిటి యోహాన్ ఏసీ కళాశాల విశ్రాంత అధ్యాపకుడు వై.శ్రీకాంత్, ఎంజేజేఎస్ కార్యదర్శి పరంగి సత్యరాజు, న్యాయవాది చందవోలు శోభారాణి, పాత్రికేయుడు నలకుర్తి విల్సన్, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కొణతం నాగేశ్వరరావు ప్రసంగించారు.


మాట్లాడుతున్న డొక్కా మాణిక్య వరప్రసాద్

తిరుమల లడ్డూ విషయంలో సిట్ దర్యాప్తు సరిపోదు: అంబటి

గోరంట్ల, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ విషయంలో సిట్ దర్యాప్తు ఏమాత్రం సరిపోదని మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. గుంటూరులోని ఆయన కార్యాలయంలో మంగళవారం మీడియాతో మాట్లాడారు. సీఎం చంద్రబాబే ఆరోపణ చేసి అతని కింద పనిచేసే డీఐజీ స్థాయి అధికారితో విచారణ చేస్తామని చెప్పడం హాస్యస్పదమన్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానం పరిధిలో ఆ ప్రక్రియ జరగాలని పేర్కొన్నారు. తిరుమల ప్రసాదం అపవిత్రమైందని అందుకు పవిత్రత చేకూర్చేందుకు శాంతియాగం చేస్తున్నారని చెబుతున్న ప్రభుత్వం.. అసలు ఎక్కడ అపవిత్రం అయ్యింది, కల్తీ నెయ్యి వాడారా? అంటే సమాధానం చెప్పడం లేదన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేస్తున్న ప్రాయశ్చిత్త దీక్ష ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో తిరుమల ప్రసాదం తయారీలో తప్పు జరిగిందని నిరూపిస్తే తాము ప్రాయశ్చిత్తం చేసుకుంటామని చెప్పారు.

భర్త, అత్తమామలపై కేసు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: అధికకట్నం కోసం భార్యను వేధింపులకు గురి చేస్తున్న భర్త, అత్తమామలపై అరండల్‌పేట ఠాణాలో కేసు నమోదైంది. చంద్రయ్యనగర్‌కు చెందిన నిత్య కల్యాణి, సాంబశివరావుకు 2009లో వివాహం జరిగింది. ఆ సమయంలో కట్నం ఇచ్చారు. ఇద్దరు పిల్లలు పుట్టారు. కొన్నాళ్లగా భర్త దురలవాట్లకు బానిసయ్యాడు. అధిక కట్నం తీసుకురమ్మని భార్యను వేధింపులకు గురిచేస్తున్నాడు. ఇందుకు అత్తమామలు మరియమ్మ, వెంకటేశ్వర్లు వంతపాడుతున్నారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం


పూడికతీత పనులు పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

నగరపాలక సంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: ఇంజినీరింగ్, ప్రజారోగ్య విభాగం అధికారులు డివిజన్లలో స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని కమిషనర్ శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం సగర కాలనీ, రామిరెడ్డితోట, ఓల్డ్‌క్లబ్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించి పూడికతీత పనులు పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ.. సగర కాలనీలో వర్షం నీరు నిల్వ ఉండకుండా కాల్వల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రామిరెడ్డితోట మొదటిలైన్‌లో మురుగునీరు రహదారిపైకి చేరి ఉండటంతో ప్రజారోగ్య అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. వెంటనే పూడిక తీసి శుభ్రం చేయించారు. ఇంజినీరింగ్ అధికారులు పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది సమన్వయంతో డ్రెయిన్లపై ఉన్న ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారు. పర్యటనలో కార్పొరేటర్ శ్రీవల్లి, సీపీ రాంబాబు, ఈఈ సుందర్రామిరెడ్డి, ఏడీహెచ్ రామారావు, ఏసీపీ అజయ్‌కుమార్, ఎంహెచ్‌వోలు రామారావు, ఆనంద్‌కుమార్, ఎస్‌ఎస్ ఆయూబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సెల్ఫీ బూత్ ప్రారంభం



స్వచ్ఛతే సేవ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఐటీసీ బంగారు భవిష్యత్, ఫినిష్ సొసైటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ హాలులో మంగళవారం సెల్ఫీ పాయింట్‌ను ప్రారంభించారు. గ్రామీణ ఘన వ్యర్థాల నిర్వహణలో ఉండే హరిత కార్మికులకు పీపీఈ కిట్లను కలెక్టర్ పంపిణీ చేశారు. డీపీవో శ్రీదేవి, సర్పంచి ఎన్.లలితకుమారి, ఐటీసీ-ఎంఎస్‌కే ప్రోగ్రాం అధికారి సురేష్, ఫినిష్ సొసైటీ మేనేజర్ నహిదా పాల్గొన్నారు.

\- న్యూస్‌టుడే, కలెక్టరేట్(గుంటూరు)


కొరటాల శివ

దర్శకుడు కొరటాల శివ నుంచి వచ్చేవన్నీ కమర్షియల్ చిత్రాలే అయినా అంతర్లీనంగా బలమైన సందేశాన్ని నింపుకుని అందర్నీ అలరిస్తుంటాయి. కుటుంబం, సమాజం, ప్రకృతి.. ఇలా ఏదోక దాని విషయంలో బాధ్యతల్ని గుర్తు చేస్తుంటాయి. 'మిర్చి', 'శ్రీమంతుడు', 'భరత్ అనే నేను' లాంటివన్నీ ఈ కోవకు చెందినవే. ఇప్పుడాయన కథానాయకుడు ఎన్టీఆర్‌తో చేసిన పాన్ ఇండియా చిత్రం 'దేవర'. 'జనతా గ్యారేజ్' విజయం తర్వాత ఈ ఇద్దరి నుంచి వస్తున్న రెండో సినిమా ఇది. ఈ చిత్ర తొలి భాగం 'దేవర పార్ట్ 1' పేరుతో ఈ నెల 27న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకున్నారు కొరటాల శివ.

మనిషిని సరైన దారిలో నడిపించేది భయమే!

అందరూ ధైర్యాన్ని సానుకూలంగా.. భయాన్ని నెగెటివ్‌గా చూస్తుంటారు. కానీ, 'దేవర'లో భయాన్ని ఎందుకు చూపించనున్నారు?

"మనిషికి ధైర్యం అవసరమే కానీ మితిమీరిన ధైర్యం మంచిది కాదు. అది మూర్ఖత్వానికి.. విధ్వంసానికి కారణమవుతుంది. అందుకే మనలో ఉన్న భయాన్ని గౌరవించాలి. అది అందరికీ మంచిది. ఎవరైనా భయం ఉండకూడదని చెబితే అది చాలా తప్పు. ట్రాఫిక్‌లో రెడ్ సిగ్నల్ పడినప్పుడు ఎవరైనా ఆగుతారంటే ఓ భయం వల్లే. లేదంటే ఎవరూ ఆగరు. భయమే మనిషిని సరైన దారిలో నడిపిస్తుందని నమ్ముతా. దీన్నే 'దేవర'లో చాలా గట్టిగా చెప్పా".

'ఆచార్య' ఫలితాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ కథ పరంగా ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు?

"నేను జయాపజయాల్ని ఒకేలా తీసుకుంటాను. ఏదైనా టీమ్ ఎఫర్టే. అన్నీ నాకే తెలుసని నేనెప్పుడూ అనుకోను. ఇక కథ పరంగా అంటే దీని విషయంలో చాలా జాగ్రత్తలే తీసుకున్నా. మనం ఒక పరీక్ష బాగా రాయకపోతే దాని తర్వాత పరీక్ష కచ్చితంగా బాగా రాయాలనుకుంటాం కదా. ఇదీ అంతే. 'ఆచార్య' విడుదలైన 20రోజుల్లోపే నేను ఈ చిత్ర పనుల్లో బిజీ అయిపోయాను. అందుకే ఆ ఫలితం నాపై మరీ అంతగా ప్రభావం చూపలేదు".

ప్రస్తుతం మీకు చిరంజీవికి మధ్య అనుబంధం ఎలా ఉంది?

"మా అనుబంధం ఎప్పుడూ మంచిగానే ఉంటుంది. 'ఆచార్య' విడుదలయ్యాక నాకు మెసేజ్ పెట్టిన మొదటి వ్యక్తి చిరంజీవి. 'నువ్వు రెట్టించిన ఉత్సాహంతో తిరిగి రావాలి. చాలా గట్టిగా కొట్టాలి' అని సందేశం పంపారు. అలాంటి వ్యక్తికి నాకు మధ్య తేడా ఏముంటుంది. కాకపోతే కొందరు సామాజిక మాధ్యమాల ద్వారా చెడును ప్రచారం చేసే ప్రయత్నం చేస్తున్నారు. అలా చేయొద్దని విజ్ఞప్తి చేస్తున్నా. సోషల్ మీడియాని మంచికి ఉపయోగించాలని కోరుకుంటున్నా".

ఈ కథ విన్నాక ఎన్టీఆర్ స్పందనేంటి? మీకెలాంటి ప్రోత్సాహాన్నిచ్చారు?

"తారక్ ఏదైనా ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడతారు. ఎక్కడా రాజీ పడరు. బాగున్నా.. బాలేకున్నా నిర్మొహమాటంగా చెప్పేస్తారు. ఈ కథ చెప్పగానే తను చాలా ఆసక్తికరంగా ఉందన్నారు. ఆయన వల్లే ఈ చిత్రం ఇంత బాగా వచ్చింది. ఎన్టీఆర్ నాకు మంచి స్నేహితుడితో సమానం. దేవర పాత్ర ఎంత శక్తిమంతంగా ఉంటుందో తన కొడుకు వర పాత్ర అంతకు మించేలా ఉంటుంది".

ఈ చిత్రంతో జాన్వీ కపూర్, సైఫ్ అలీ ఖాన్‌తో కలిసి పని చేయడం ఎలా అనిపించింది?

"జాన్వీ చాలా ప్రతిభావంతురాలు. తొలి రోజు సీన్ పూర్తవగానే తన ప్రతిభ చూసి నేను, ఎన్టీఆర్ షాకయ్యాం. అంత గొప్పగా చేసింది. కథ రాసుకున్నప్పుడే భైరా పాత్రకు సైఫ్ అయితేనే సరిపోతారనిపించింది. ఎంతో మంది లెజెండరీ టెక్నీషియన్స్ ఈ సినిమా కోసం కష్టపడ్డారు".

ఇది మీ తొలి పాన్ ఇండియా చిత్రం కదా. బడ్జెట్, ప్రచార విషయాల్లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు?

"బడ్జెట్ చూసుకోవడం చాలా కష్టం. అన్ని కోణాల్లో నిర్మాతలకు లాభాలు రావాలని చూస్తుంటా. ఓటీటీ హక్కుల గురించి కూడా ఆలోచిస్తా. ఇక మార్కెటింగ్ విషయంలో నేను కొంచెం వీక్. నా కథకు న్యాయం చేయడం కోసమే ఎప్పుడూ ప్రయత్నిస్తుంటా. నిర్మాతల్ని దృష్టిలో పెట్టుకుని ప్రచారం విషయంలో వాళ్లకు సలహాలిస్తుంటా".


శ్రీహర్ష, కశిక కపూర్

తండ్రి ఆరాటం.. కొడుకు పోరాటం!

శ్రీహర్ష, కశిక కపూర్ జంటగా పవన్ కేతరాజు తెరకెక్కిస్తున్న చిత్రం 'లైఫ్'. లవ్ యువర్ ఫాదర్.. అన్నది ఉపశీర్షిక. కిశోర్ రాఠీ, మహేశ్ రాఠీ, ఎ.రామస్వామి రెడ్డి నిర్మిస్తున్నారు. ఎస్పీ చరణ్, రఘుబాబు తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయినట్లు చిత్ర బృందం మంగళవారం ప్రకటించింది. దర్శకుడు పవన్ మాట్లాడుతూ.. "తన బిడ్డ బాధ్యత తీర్చేందుకు తండ్రి పడే ఆరాటం.. ఆ తండ్రి కోసం కొడుకు చేసే పోరాటం నేపథ్యంలో ఈ సినిమా సాగుతుంది" అన్నారు.



ఎర్ర మందారం... మెరుపు సింగారం

ఓ వైపు సినిమాల్లో వారి నటనతో సినీప్రియుల్ని మురిపిస్తూనే.. అవకాశం వచ్చినప్పుడు, వీలు చిక్కినప్పుడు ఫ్యాషన్ ప్రపంచంలోనూ తళుక్కున మెరుస్తుంటారు మన అందాల నాయికలు. తాజాగా కథానాయికలు ఐశ్వర్య రాయ్, అలియా భట్ పారిస్ ఫ్యాషన్ వీక్‌లో పాల్గొని సందడి చేశారు. ప్రపంచ స్థాయిలో జరిగే ఈ ఫ్యాషన్ షోలో ఐశ్వర్య ఎర్రమందారంలా ఎరుపు రంగు దుస్తుల్లో అలరించింది. తొలిసారి ఈ ఫ్యాషన్ వీక్‌లో సందడి చేసిన అలియా నలుపు, వెండి రంగు డ్రెస్‌లో మెరిసింది. హాలీవుడ్ అందాల తారల మధ్య ఈ ఇద్దరూ ర్యాంప్‌పై ఆకట్టుకున్నారు.

కొత్త ప్రపంచాన్ని చూపించే జటాధర


సుధీర్‌బాబు

"ప్రేక్షకుల్ని ఆశ్చర్యపరిచే ఎన్నో విషయాలు మా 'జటాధర' చిత్రంలో ఉన్నాయంటు"న్నారు హీరో సుధీర్‌బాబు. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ పాన్ ఇండియా సినిమాని వెంకట్ కల్యాణ్ తెరకెక్కిస్తున్నారు. ప్రేరణ అరోరా సమర్పణలో సుధీర్‌బాబు ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మిస్తున్నారు. ఈ చిత్ర సెకండ్ లుక్‌ను మంగళవారం విడుదల చేశారు. అందులో సుధీర్ బైక్‌పై వస్తుండగా.. ఆకాశంలో ఓ మహాశక్తి అవతారం కనిపించడం ఆసక్తి రేకెత్తించేలా ఉంది. ఈ సందర్భంగా సుధీర్ బాబు మాట్లాడుతూ.. "ఈ చిత్రంలోకి అడుగు పెట్టడం నాకు ఓ సరికొత్త ప్రపంచాన్ని పరిచయం చేసింది. మర్చిపోలేని అనుభవమిది. శక్తిమంతమైన పౌరాణిక అంశాల మేళవింపుతో ఈ కథను రాశారు. ఈ రెండు జానర్ల కలయికతో వెండితెరపై కొత్త ప్రపంచాన్ని చూస్తున్నప్పుడు ప్రేక్షకులు ఓ సరికొత్త అనుభూతిని పొందుతారు. విజువల్‌గా, ఎమోషనల్‌గా ఓ అద్భుతమైన సినిమాని ప్రేరణ రూపొందిస్తున్నారు" అన్నారు.

రోమ్‌ను కాపాడేందుకు 'గ్లాడియేటర్' పోరు

మరిన్ని విశేషాలు www.eenadu.net లో


సునీల్‌నారంగ్, రాకేందు మౌళి, ప్రశాంత్ వర్మ, కార్తి, శ్రీదివ్య, ప్రేమ్‌కుమార్, సురేశ్‌బాబు

సిరిమల్లె చెట్టు లాంటి అందమైన చిత్రం

"'ఊపిరి' నా కెరీర్‌లో ఎంతో ప్రత్యేకం. దాని తర్వాత మళ్లీ అంతే ప్రత్యేకమైన చిత్రం 'సత్యం సుందరం'. ఇలాంటి సినిమాలు తెరపైకి రావడం చాలా కష్టం. ఇది తప్పకుండా అందరి మనసుల్ని హత్తుకుంటుంది" అన్నారు హీరో కార్తి. ఆయన.. అరవింద్ స్వామి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని '96' ఫేమ్ సి.ప్రేమ్‌కుమార్ తెరకెక్కించారు. సూర్య, జ్యోతిక నిర్మించారు. శ్రీదివ్య కథానాయిక. ఈ సినిమా ఈ నెల 28న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్‌లో ఇటీవల ముందస్తు విడుదల వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో కార్తి మాట్లాడుతూ.. "ఈ చిత్రంలో బావ..బామ్మర్దుల భావోద్వేగాల్ని చూస్తారు. సినిమా చూశాక ప్రతి ఒక్కరూ వాళ్ల కజిన్స్‌కు ఫోన్ చేసి మాట్లాడతారు. మాది 'సిరిమల్లె చెట్టు'లాంటి అందమైన చిత్రం" అన్నారు. ఈ కార్యక్రమంలో విష్వక్ సేన్, శ్రీదివ్య, ప్రశాంత్ వర్మ, డి.సురేశ్‌బాబు, సునీల్ నారంగ్, రాకేందు మౌళి తదితరులు పాల్గొన్నారు.

ఓ సమస్యని చర్చిస్తూనే నవ్వులు పంచాం


హసిత్ గోలి

'రాజ రాజ చోర'తో తొలి ప్రయత్నంలోనే సినీప్రియుల్ని మెప్పించారు దర్శకుడు హసిత్ గోలి. ఇప్పుడాయన హీరో శ్రీవిష్ణుతో కలిసి రెండో ప్రయత్నంగా 'శ్వాగ్'తో అలరించేందుకు సిద్ధమయ్యారు. వీళ్ల కాంబోలో రూపుదిద్దుకున్న ఈ చిత్రాన్ని టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా అక్టోబరు 4న రానున్న నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు హసిత్.

★ "వంశ వృక్షం గురించి అందరికీ తెలిసే ఉంటుంది. కానీ, దాన్ని సినిమాలోకి తీసుకురావడం అరుదు. ఈ కథ అదే నేపథ్యంతో సాగుతుంది. ఇందులో ఓ వంశ వృక్షంలోని పలు భిన్న తరాల కథల్ని చెప్పనున్నాం. దీంట్లో శ్రీవిష్ణు నాలుగు భిన్న పాత్రల్లో కనిపిస్తారు. అలాగే ఇంకొన్ని సర్‌ప్రైజ్‌లు కూడా ఉన్నాయి".

★ "ఇది సందేశం కోసం తీసిన చిత్రం కాదు. కాకపోతే ప్రేక్షకులకు వినోదం పంచుతూనే ఓ సమస్యను చర్చిస్తుంది. తరతరాలుగా ఆడ, మగల మధ్య ఆధిపత్య పోరు ఎలా మారుతూ వచ్చింది.. సమాజంలో ఇప్పటికీ లింగ వివక్ష ఎలా సాగుతుందన్నది ఆసక్తికరంగా చూపించాం. అలాగే మాతృస్వామ్య వ్యవస్థను ఇందులో చూపించనున్నాం".

★ "భిన్న గెటప్స్‌తో కూడిన సినిమా చేయడం శ్రీవిష్ణుకే కాదు మాకూ కొత్తే. కానీ, దీన్ని అందరం ఒక సవాల్‌గా తీసుకుని కష్టపడి ఈ చిత్రం చేశాం. తెరపై విష్ణు కాకుండా ఆయన చేసిన పాత్రలే కనిపిస్తాయి".

వర్జీనియాకు మహర్దశ

రికార్డు స్థాయికి చేరిన ధరలు

గరిష్ఠంగా కిలో రూ.410కి చేరడంతో రైతుల్లో ఆనందం

ఈనాడు, ఏలూరు

వర్జీనియా పొగాకుకు మహర్దశ పట్టింది. చరిత్రలో ఎన్నడూ చూడని విధంగా రికార్డు స్థాయిలో ఉమ్మడి పశ్చిమలో ధరలు నమోదయ్యాయి. దేశంలోనే నాణ్యమైన పొగాకు కావడంతో కొనుగోలుదారులు గరిష్ఠంగా కిలో రూ.410 వరకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఈ ఏడాది దాదాపు రూ.వెయ్యి కోట్ల మేర విదేశీ మారకం ద్రవ్యం కూడా పెరగనుంది. పెరిగిన ధరలతో వేలం కేంద్రాలకు వచ్చిన రైతుల ముఖాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

గతంలో ఎన్నడూ లేని విధంగా..

ప్రపంచంలో వర్జీనియా ఉత్పత్తి, ఎగుమతుల్లో బ్రెజిల్, జింబాబ్వే, చైనా మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి. తర్వాత స్థానంలో ఇండియా ఉంది. దేశంలో అత్యంత నాణ్యమైన పొగాకు ఉమ్మడి పశ్చిమలోనే లభిస్తోంది. ఒంగోలు, నెల్లూరు జిల్లాల్లో పంట ఉన్నప్పటికీ ఈ స్థాయిలో ధరలు లేవు. గత సీజన్‌లో బ్రెజిల్, జింబాబ్వే భారీ వర్షాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల ప్రభావంతో 30 శాతం దిగుబడి తగ్గింది. చైనాలో అక్కడి ప్రభుత్వ విధానాలతో రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకుంటున్నారు. దీంతో ఉమ్మడి పశ్చిమలోని వర్జీనియాకు భారీ డిమాండ్ ఏర్పడింది. జంగారెడ్డిగూడెం, గోపాలపురం, కొయ్యలగూడెం, దేవరపల్లిలోని వేలం కేంద్రాలకు వ్యాపారులు క్యూ కడుతున్నారు. గత 12 ఏళ్లలో కిలో వర్జీనియా ధర రూ.150-290 మధ్యలోనే ఉంది. ఈ సారి మాత్రం రికార్డు స్థాయిలో కిలో రూ.410 చేరింది. రూ.120 వరకు పెరిగింది. 1984లో జిల్లాలో పొగాకు బోర్డు వేలం కేంద్రాలు ఏర్పాటు కాగా ఈ స్థాయిలో ధర పలకడం ఇదే ప్రథమం.

గత అయిదేళ్లలో వర్జీనియా పొగాకు గరిష్ఠ ధరల వివరాలు

ఏడాది	గరిష్ఠ ధర (రూ.లలో)
2019-20	211
2020-21	192
2021-22	245
2022-23	287
2023-24	410


జంగారెడ్డిగూడెం వేలం కేంద్రానికి తెచ్చిన పొగాకు బేళ్లు

రూ.7 వేల కోట్ల విదేశీ మారక ద్రవ్యం


ఉమ్మడి పశ్చిమలో గతంలో 18 వేల హెక్టార్లలో వర్జీనియా సాగు జరిగేది. ప్రస్తుతం ఇది 21 వేల హెక్టార్లకు పెరిగింది. ఒక్కో హెక్టారుకు సగటున 2600 కిలోల వర్జీనియా దిగుబడి వస్తోంది. 16,500 వరకు పొగాకు బ్యారన్‌లు ఉన్నాయి. ఇప్పటి వరకు జిల్లాలో రూ.2,800 కోట్ల విలువైన వర్జీనియా అమ్మకాలు జరిగాయి. ఇక్కడి నుంచి కొనుగోలు చేసిన వ్యాపారులు సముద్ర మార్గాల్లో గల్ఫ్, ఐరోపా దేశాలకు వీటిని ఎగుమతి చేస్తారు. దీని ద్వారా ఏటా రూ.6 వేల కోట్ల వరకు విదేశీ మారక ద్రవ్యం సమకూరుతోంది. ఈ ఏడాది ధర భారీగా పెరగడంతో రూ.వెయ్యి కోట్లు పెరిగి రూ.7 వేల కోట్ల వరకు చేరనుంది. దీనిపై జంగారెడ్డిగూడెం వేలం నిర్వహణాధికారి శ్రీహరి మాట్లాడుతూ..'రికార్డు స్థాయిలో ధరలు ఉన్నాయని రైతులు ఎక్కువ పెట్టుబడులు పెడితే వచ్చే ఏడాది ఈ ధరలు ఉండకపోవచ్చు.. ఇతర దేశాల్లో కొరత వల్ల ఈ స్థాయి ధరలు ఉన్నాయి. కాబట్టి పెట్టుబడుల విషయంలో అప్రమత్తంగా ఉండాలి' అని సూచించారు.

భక్తుల మనోభావాలు దెబ్బతీయడం దారుణం


పూజల్లో గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మాధవి, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ యాదవ్, జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు తదితరులు

నగరంపాలెం, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో హిందూ భక్తుల మనోభావాలతో ఆడుకుంటూ వారి విశ్వాసాలను దెబ్బతీశారని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి మండిపడ్డారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు చేపట్టిన ప్రాయశ్చిత దీక్షకు మద్దతుగా గుంటూరు జిల్లా జనసేన ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక గోరంట్లలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా గుంటూరు పశ్చిమ, తూర్పు ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, నసీర్ అహ్మద్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, భాజపా జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్‌లు పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు మాధవి, నసీర్ అహ్మద్‌లు మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వ హయంలో రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసి రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ కల్యాణ్ బాటలోనే దీక్ష స్వీకరిస్తున్న జనసేన నాయకులు, కార్యకర్తలకు, వీర మహిళలకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ కోట్లాది మంది ప్రజల నమ్మకాన్ని గత ప్రభుత్వం పట్టించుకోకుండా తితిదే ప్రతిష్ఠ దిగజార్చడం దారుణమన్నారు. గుంటూరు జిల్లా జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు పాల్గొన్నారు.

ప్రపంచం గర్వించే తత్వశాస్త్రవేత్త సచ్చిదానందమూర్తి



సచ్చిదానందమూర్తి జీవిత విశేషాల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వాడ్రేవు చినవీరభద్రుడు, ఇతర అతిథులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: సమాజానికి జ్ఞానాన్ని అందించే ప్రయత్నం చేసిన మహనీయుల గురించి నేటితరం తెలుసుకోవాలని, మన ప్రాంత విజ్ఞాని కొత్త సచ్చిదానందమూర్తి ప్రపంచం గర్వించదగిన తత్వశాస్త్రవేత్త అని ప్రముఖ కవి, కథారచయిత, గిరిజన సంక్షేమ శాఖ విశ్రాంత సంచాలకులు వాడ్రేవు చినవీరభద్రుడు తెలిపారు. వివేక ఎడ్యుకేషనల్ సొసైటీ, తెనాలి ఇంప్రెషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని శ్రీవివేకానంద సెంట్రల్ స్కూల్ ప్రాంగణంలోని సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన సచ్చిదానందమూర్తి శత జయంతి సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సభలో ఆయన మాట్లాడుతూ చైనా, జపాన్ దేశాలు భారతదేశంలోని తత్త్వవేత్తల్లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ తర్వాత డాక్టరేట్లు ఇచ్చింది సచ్చిదానందమూర్తికే అని పేర్కొన్నారు. యువతను రాజకీయ నాయకులు కార్యకర్తలుగా, సామాజిక మాధ్యమ ఫాలోవర్స్, ట్రోలర్స్‌గా, సినీ తారలు పాలాభిషేకాలకు, క్రీడాకారులు చప్పట్లకు వాడుకుంటారని, కానీ బానిసగామారకు నిన్ను నీవు తెలుసుకో, ప్రశ్నించడం నేర్చుకో, దీపంగా మారి నీ వెలుగులో నిన్ను అధ్యయనం చేసుకో అని సరైన మార్గాన్ని చూపేవాడు తత్వవేత్తని విశ్లేషించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ విశ్రాంత తెలుగు శాఖాధిపతి ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి మాట్లాడుతూ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి ఆ పేరు పెట్టాలని, గుంటూరు-విజయవాడ మార్గంలో ఏర్పాటు చేయాలని సూచించినది సచ్చిదానందమూర్తేనని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా సచ్చిదానందమూర్తి జీవిత విశేషాలను వివరిస్తూ బి.ఎల్.నారాయణ రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. వివేక విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణరావు, సచ్చిదానందమూర్తి కుమారుడు కృష్ణ, డాక్టర్ దక్షిణామూర్తి, రామరాజు, వెంకటరత్నం, భీమేశ్వరప్రసాద్ మాట్లాడారు. పుస్తక రచయిత నారాయణ, మరో రచయిత జుగాష్ విల్లీలను సత్కరించారు. తొలుత సచ్చిదానందమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

విద్యుత్తు సంస్థల్లో భారీగా బదిలీలు

గుంటూరు విద్యుత్తు, న్యూస్‌టుడే: విద్యుత్తు సంస్థలో గత మూడు రోజుల నుంచి బదిలీలపై నెలకొన్న ఉత్కంఠ మంగళవారం రాత్రితో వీడింది. భారీ మార్పులు చేస్తూ సెంట్రల్ డిస్కం సీఎండీ పి.రవి బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో పాటు కొత్తగా ఏర్పాటైన నరసరావుపేట, బాపట్ల సర్కిల్స్‌కు అధికారులను కేటాయించారు. గుంటూరు డీపీఈ-2 ఈఈగా ఉన్న కేవీఎల్ఎన్ మూర్తిని ఈఈ(టెక్నికల్)గా గుంటూరులోనే నియమించారు. ఆయనకు త్వరలోనే ఎస్ఈగా పదోన్నతి రానుంది. ఎంఆర్‌టీ ఈఈగా ఉన్న వెంకటేశ్వరరావును డీపీఈకి మార్చి ఆయన స్థానంలో డీపీఈ-1 ఈఈగా ఉన్న కె.సూర్యప్రకాష్‌ను నియమించారు. సీఆర్‌డీఏ అమరావతి సర్కిల్ ఈఈ తుల సీరామ్‌ను తెనాలి ఈఈగా మార్చారు. గుంటూరు ఈఈ ఎంఅండ్‌పీ-1గా ఉన్న సింగయ్యను బాపట్ల ఈఈ(కన్‌స్ట్రక్షన్)గా మార్చారు. తెనాలి ఈఈ చిరంజీవిని బాపట్ల ఈఈ ఎంఆర్‌టీగా బదిలీ చేశారు. దర్శి ఈఈ కరీమ్‌ను బాపట్ల ఈఈ డీపీఈగా నియమించారు. గుంటూరు ఈఈ ఎంఅండ్‌పీ-2గా పనిచేస్తున్న నాగేశ్వరరావును బాపట్ల ఈఈ టెక్నికల్ గా మార్చారు. విజయవాడ కార్పొరేట్ కార్యాలయంలో ఈఈగా పనిచేస్తున్న రామసుబ్బారావును పల్నాడు సర్కిల్ ఈఈ కన్‌స్ట్రక్షన్‌గా బదిలీ చేశారు. గుంటూరులో ఈఈ టెక్నికల్‌గా పనిచేస్తున్న శ్రీనినవాసులురెడ్డిని ఈఈ ఎంఆర్‌టీ పల్నాడుకు మార్చారు. సీఆర్‌డీఏ సర్కిల్ ఈఈ(టెక్నికల్)గా పనిచేస్తున్న రామబొట్లును నరసరావుపేట ఈఈగా మార్చారు. మచిలీపట్నంలో ఈఈగా పనిచేస్తున్న ఎం.భాస్కరరావును మాచర్ల ఈఈగా మార్చారు. అక్కడ పనిచేస్తున్న హరిబాబును సీఆర్‌డీఏ సర్కిల్ ఈఈ కన్‌స్ట్రక్షన్, టెక్నికల్‌గా బదిలీ చేశారు. నరసరావుపేటలో ఈఈగా పనిచేస్తున్న శ్రీనివాసరావును ఈఈ ఎంఆర్‌టీ సీఆర్‌డీఏకు మార్చారు. విజయవాడలో ఈఈగా పనిచేస్తున్న సంజీవరావును ఈఈ అమరావతికి మార్చారు. అదేవిధంగా గుంటూరులో డిప్యూటీ ఈఈ టౌన్-1గా పనిచేస్తున్న ముస్తాక్ అహ్మద్‌ను చుండూరుకు, ఆయన స్థానంలో నరసరావుపేటలో పనిచేస్తున్న ఏడుకొండలను నియమించారు. టౌన్-2 డిప్యూటీ ఈఈగా పనిచేస్తున్న సుబ్బరాయుడును బాపట్ల టీఆర్‌ఈకి మార్చి ఆయన స్థానంలో ఒంగోలులో పనిచేస్తున్న ఎన్.గురవయ్యను నియమించారు. గుంటూరు స్టోర్సులో డిప్యూటీ ఈఈగా పనిచేస్తున్న రాజేష్‌ఖన్నాను సర్కిల్ ఆఫీస్‌కు మార్చి అక్కడ పనిచేస్తున్న నాసరయ్యను స్టోర్సుకు బదిలీ చేశారు. అమరావతి డివిజన్‌లో డిప్యూటీ ఈఈగా పనిచేస్తున్న సురేష్‌బాబును మంగళగిరికి మార్చి అక్కడ పనిచేస్తున్న సత్యనారాయణను గుంటూరు హెచ్‌టీఎం, సీటీఎంగా మార్చారు.

దేశ రాజకీయాల్లో సీతారాం ఏచూరి ఆణిముత్యం



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, వేదికపై లక్ష్మణరావు, ఆలపాటి, రామారావు, అజయ్‌కుమార్ తదితరులు

నెహ్రూనగర్ (గుంటూరు), న్యూస్‌టుడే: దేశ రాజకీయాల్లో సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆణిముత్యంలాంటివారని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక బ్రాడీపేటలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏచూరి సంస్మరణ సభ జరిగింది. సభకు నగర కార్యదర్శి నళినీకాంత్ అధ్యక్షత వహించారు. సభలో శ్రీనివాసరావు మాట్లాడుతూ డబ్బు, సంపాదన కోసమే రాజకీయాల్లోకి వస్తున్న నేతలున్న ఈ రోజుల్లో జీవితాంతం నిరాడంబరంగా ఉంటూ ప్రజా పోరాటాలకే ప్రాధాన్యం ఇచ్చిన ఏచూరి రాజకీయాల్లో అత్యంత అరుదైన వ్యక్తని కొనియాడారు. దేశంలో గత పదేళ్లుగా మతతత్వ ధోరణులను పెంచి పోషిస్తున్న పాలకులకు దీటుగా ఆయన లౌకిక వాద శక్తులను కూడగట్టడంలో కీలక భూమిక పోషించారన్నారు. తాజాగా తెరమీదకు వచ్చిన జమిలీ ఎన్నికలు వల్ల ప్రాంతీయ పార్టీల ఉనికికి దెబ్బ తగులుతుందని, రాష్ట్ర విభజనను ఆయన తీవ్రంగా వ్యతిరేకించినట్టు తెలిపారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలీ, సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, జనచైతన్యవేదిక అధ్యక్షుడు లక్ష్మణరెడ్డి, విరసం అధ్యక్షుడు సీఎస్ఆర్ ప్రసాద్, విసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్, ప్రజా గాయకుడు రమణ ప్రసంగించారు. ముందుగా సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

మిర్చియార్డులో అక్రమాలకు అడ్డుకట్ట వేయాలి

మిర్చియార్డు, న్యూస్‌టుడే: మిర్చియార్డులో జరిగే అక్రమాలు, అవకతవకలకు అడ్డుకట్ట వేయాలని మార్కెటింగ్ కమిషనర్ విజయ సునీత అధికారులను ఆదేశించారు. గుంటూరు మిర్చియార్డులో మంగళవారం ఆమె పర్యటించారు. యార్డులో జరిగే లావాదేవీలను, ఈ-నామ్ బిడ్డింగ్ హాలును ఆమె పరిశీలించారు. మార్కెటింగ్ శాఖ అధికారులు, సిబ్బందితో సమావేశమై విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఒకరిపై మరొకరు ఫిర్యాదులు చేసుకుని మార్కెటింగ్ శాఖకు మచ్చ తీసుకురావద్దని సూచించారు. 'మిర్చియార్డులోకి వచ్చే ప్రతి బస్తాకు లెక్క ఉండాలని, ఇన్‌గేట్, అవుట్ గేట్‌లో లెక్క సరిపోవాలని, ప్రతిదీ ఆన్‌లైన్ చేయాల్సిందేనని పేర్కొన్నారు. మార్కెటింగ్ సెస్ వసూళ్లలో అలసత్వం వహించొద్దని, ప్రతి బస్తాకు సెస్ చెల్లించాకే యార్డులో నుంచి వెలుపులకు వెళ్లాలని, కమీషన్ ఏజెంట్ల లైసెన్స్‌లు, దుకాణాల కేటాయింపులో అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, బినామీలు ఎవరున్నా చర్యలు తీసుకోవాలన్నారు. ఒక్కో కుటుంబంలో ఎన్ని కమీషన్ ఏజెంట్ల దుకాణాలు ఉన్నాయో గుర్తించి సమగ్ర నివేదిక ఇవ్వాలన్నారు. మార్కెటింగ్ జేడీలు రాజశేఖర్, శ్రీనివాసరావు, డీడీ ఝాన్సీరాణి, కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిట్స్ నిర్వాహకులు రూ.2 కోట్లతో ఉడాయింపు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: చిట్స్ నిర్వాహకులు సుమారు రూ.2 కోట్లతో ఉడాయించారు. చైతన్యపురి కాలనీకి చెందిన ఇద్దరు దంపతులు చిట్స్ నిర్వహిస్తున్నారు. రూ.లక్ష, రూ.2లక్షలు, రూ.4లక్షలు, రూ.5లక్షలు ఇలా పలు రకాల చిట్స్ నిర్వహిస్తున్నారు. మాయమాటలతో చుట్టుపక్కల ప్రాంతాల వారి నుంచి చిట్స్ వేయించుకున్నారు. చిట్స్ పాడుకున్న వారికి నగదు ఇవ్వకుండా వాయిదాలు వేస్తూ వచ్చారు. ఈ విధంగా సుమారు రూ.2 కోట్లు వరకు పోగేసుకుని కనిపించకుండా పరారయ్యారు. దీనితో పలువురు బాధితులు అరండల్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.